V3 NEWS
లక్ష్యం సమాజహితం

www.vishvambhara.com
తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా...



Ln. డా॥ కాచం సత్యనారాయణ
M.A,MSW,PGDCJ,LLB

తెలంగాణ । ఆంధ్రప్రదేశ్ సంపుటి:1 । సంచిక: 19 హైదరాబాద్ మంగళవారం । 21-05-2024 పేజీలు:8 । వెల: రూ॥ 5



# మద్దతు ధరకే తడిసిన ధాన్యం కొనుగోలు

## 3 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ

- ధాన్యం కొనుగోళ్లపై పూర్తి బాధ్యత కలెక్టర్లదే
- సన్నవడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్
- నకిలీ విత్తనాలు అమ్మేవారిపై కఠిన చర్యలు
- మేడిగడ్డకు మరమ్మతులు చేసినా నో గ్యారెంటీ
- స్కూళ్ల ఆధునికీకరణకు రూ.600 కోట్లు
- అమ్మ ఆదర్శ పాఠశాలలపై కేబినెట్ సబ్ కమిటీ
- రాష్ట్ర అవతరణ వేడుకలకు సోనియాగాంధీకి ఆహ్వానం
- కేబినెట్ భేటీలో నిర్ణయాలు తీసుకున్న మంత్రివర్గం
- వివరాలు వెల్లడించిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు

**విశ్వంభర, హైదరాబాద్ :** అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని, కనీస మద్దతు ధరకే కొనాలని తెలంగాణ మంత్రివర్గం నిర్ణయించింది. ఈసీ అనుమతితో సమావేశమైన తెలంగాణ మంత్రివర్గం 3 గంటల పాటు వివిధ అంశాలపై చర్చించి, పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ అంశాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్‌బాబు మీడియాకు వెల్లడించారు. ఇప్పటివరకు సేకరించిన ధాన్యానికి 3 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. తెలంగాణలో ప్రజలకు, విద్యార్థులకు 36 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం అవసరం ఉందన్న మంత్రి, ఆ మొత్తం రాష్ట్రంలోనే సేకరిస్తామన్నారు. గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలకు తడిచిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరకే కొనటానికి కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. దీనిపై కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న రైతన్నలెవరూ కూడా ఆందోళన చెందొద్దని మంత్రి భరోసా ఇచ్చారు. ఇతరులు చెప్పే మాయ మాటలు నమ్మొద్దని రైతులను కోరారు.

మిగతా 2 లో

# బోనస్.. పెద్ద బోగస్


**బోనస్ ఇవ్వాల్సింది దొడ్డు రకం వడ్లకే కాని సన్న రకానికి కాదు**

**ఈ సీజన్ నుంచే అన్ని రకాల వడ్లకు రూ.500 చొప్పన బోనస్ చెల్లించాలి**

**రైతులపై కాంగ్రెస్‌కు ఏమాత్రం చిత్తశుద్ధి లేదని మంత్రుల ప్రకటనతో స్పష్టమైంది**

**ఎన్నికల హామీలు అధికారంలోకి రావాలనే దురుద్దేశంతో ఇచ్చినవే..**

**రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీష్ రావు ఫైర్**



**విశ్వంభర, హైదరాబాద్ మే 20 :** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మరో ఎన్నికల హామీని తుంగలో తొక్కిందని మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. నిరుద్యోగులకు నెలకు రూ. 4,000 భృతి ఇస్తామని హామీ ఇచ్చి, మేము ఆ మాట అనలేదని అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, నేడు వడ్లకు బోనస్ ఇచ్చే విషయంలో కూడా పచ్చి అబద్ధం ఆడి, రైతులను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు తాము పండించిన పంటను అమ్మకానికి సిద్ధపడి బోనస్ కోసం ఎదురు చూస్తుండగా, వారందరి ఆశలు అడియాసలు చేస్తూ కేవలం సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని, అది కూడా వచ్చే సీజన్ నుంచి ఇస్తామని మంత్రులు ప్రకటించడం అత్యంత బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 90 శాతం దొడ్డు రకం వడ్లనే పండిస్తారని, పది శాతం పండే సన్న వడ్లకు మార్కెట్లో మంచి డిమాండు ఉంటుందన్నారు. కానీ దొడ్డు రకం బియ్యానికే గిట్టుబాటు ధర రాదు. కాబట్టి బోనస్ ఇవ్వాల్సింది దొడ్డు రకం వడ్లకేనని తెలిపారు.

మిగతా 2 లో

## కవితకు మళ్లీ నిరాశే..

- జ్యుడిషియల్ రిమాండ్‌ను పొడిగించిన కోర్టు
- జూన్ 3 వరకు కవిత రిమాండ్‌ను పొడిగిస్తూ ఉత్తర్వులు

2 లో..



# ప్రశాంతంగా ముగిసిన ఐదో విడత పోలింగ్

- 6 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటింగ్ పూర్తి
- 49 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు
- ఓటేసేందుకు క్యూ కట్టిన సినీనటులు

2 లో..






# అర్ధరాత్రి రేవ్ పార్టీ

- బెంగుళూరు శివారులోని ఓ ఫామ్‌హౌస్‌లో విందు, వినోదం
- పార్టీకి బెంగళూరు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 100 మంది హాజరు
- పోలీసుల తనిఖీల్లో 17 గ్రాముల డ్రగ్స్ లభ్యం
- రేవ్ పార్టీలో తెలుగు సినిమా, టీవీ నటీనటులు, మోడళ్లు
- పార్టీలో హీరో శ్రీకాంత్, క్యారెక్టర్ ఆర్టిస్ట్ హేమ?
- పట్టుబడిన కార్లలో ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యే వెహికల్
- మీడియా కథనాలను ఖండించిన టాలీవుడ్ నటులు

2 లో..



## బోర్డ్ తిప్పేసిన ఫైనాన్స్ కంపెనీ

- రూ. 200 కోట్లతో ఉడాయించిన శ్రీ ప్రియాంక ఎంటర్‌ప్రైజెస్
- అధిక వడ్డీలు ఇస్తామని నమ్మబలికిన కంపెనీ
- 'ప్రియాంక'లో పెట్టుబడులు పెట్టిన 517 మంది
- ఏజెంట్లను పెట్టి ప్రజల దగ్గరా వసూలు చేసిన ఫైనాన్సర్లు
- రాత్రికి రాత్రే బోర్డు తిప్పేసిన ఫైనాన్స్ కంపెనీ
- బషీర్‌బాగ్ సీసీఎస్ పీఎస్‌లో బాధితుల ఫిర్యాదు


2 లో..

## టీపీసీసీ చీఫ్ ఎవరు..?

### అధ్యక్ష పదవి రేసులో కీలక నేతలు

- రేసులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- నాకే పార్టీ పగ్గాలు ఇవ్వాలంటున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి
- బీసీ సామాజిక వర్గం నుంచి మధుయాష్కీ గౌడ్, మహేష్ కుమార్ గౌడ్, అంజన్ కుమార్ యాదవ్
- షబ్బీర్ అలీ, మంత్రి సీతక్క పేర్లూ పరిశీలన

2 లో..







## 20 అడుగుల లోయలో పడ్డ బస్సు

- 19మంది మృతి, 8మందికి తీవ్ర గాయాలు
- మృతుల్లో 17 మంది మహిళలు
- తునికాకు సేకరణకు వెళ్లి వస్తుండగా ప్రమాదం
- ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి సంతాపం

2 లో..




**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫామ్ ధర | :రూ.150 |
| రిటైల్ | :రూ. 172 |
| స్కిన్ | :రూ. 249 |
| స్కిన్ లెస్ | :రూ.284 |

## ఒడిశాలో తొలిసారి బీజేపీ ప్రభుత్వం రాబోతోంది

- జూన్ 10న ప్రమాణస్వీకారం చేస్తాం
- ఇక్కడి ప్రభుత్వం మాఫియాలనే ప్రజలకు ఇచ్చింది
- బీజేడీ ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి పంపుతున్నారు
- కటక్ ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోదీ సంచలన వ్యాఖ్యలు

2 లో..



## డయాలసిస్ బాంబ్

### చందంపేటను చుట్టుముట్టింది

- ఒక్క ఈ మండలంలోనే 50 మంది పేషెంట్లు
- పట్నంలో చూయించుకునే వాళ్లు మరో ఐదారుగురు
- అత్యధిక మైనింగ్, క్రషర్ మిల్లులే కారణం
- ధూళి రేణువులు పీల్చడంతో పెరుగుతున్న రోగులు
- చేష్టలుడిగి చూస్తోన్న అధికార యంత్రాంగం
- పట్టించుకోని పాలకులు

2 లో..



# మద్దతు ధరకే తడిసిన ధాన్యం కొనుగోలు

(మొదటిపేజీ తరువాయి)

ఇందుకోసం సన్నవడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలని నిర్ణయించామని చెప్పారు. నకిలీ విత్తనాలు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలల ఆధునీకీకరణకు, సుమారు రూ.600 కోట్లు కేటాయిస్తామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులపై, మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ వేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. జూన్ 2 నాటికి తెలంగాణ ఏర్పడి పదేళ్లు పూర్తవుతుందన్న మంత్రి, రాష్ట్ర అవతరణ వేడుకలకు తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీని ఆహ్వానించి సన్మానించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ మేరకు అనుమతి కోసం ఈసీఐకి లేఖ రాయాలని నిర్ణయించారు.

### మేడిగడ్డకు మరమ్మతులు చేసినా లాభం ఉండదు

కేబినెట్‌లో మేడిగడ్డపై ఎన్‌డీఎస్‌ఏ ఇచ్చిన మధ్యంతర నివేదికపైనా చర్చించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో ఎన్‌డీఎస్‌ఏ సూచనలకనుగుణంగా వ్యవహరిస్తామని చెప్పారు. మేడిగడ్డకు మరమ్మతులు చేస్తే, సరి అవుతుందన్న గ్యారంటీ లేదని, నీరు నిల్వ చేసే పరిస్థితి కూడా లేదని ఎన్‌డీఎస్ఏ కమిటీ చెప్పిందని వివరించారు. అందుకే, తాత్కాలికంగా ఏమైనా ఏర్పాటు చేసైనా సరే రైతులకు నీరు ఇవ్వాలని భావిస్తున్నట్లు చెప్పారు.

### స్కూళ్ల ఆధునికీకరణకు రూ.600 కోట్లు

రాష్ట్రంలోని ప్రభుత్వ బడులను ఆధునీకరించాలని కేబినెట్ భేటీలో నిర్ణయించినట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. అందుకు రూ.600 కోట్లను కేటాయిస్తామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలపై తను అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ వేసినట్లు మంత్రి చెప్పారు. ఇక, లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో రైతులకు రూ.2 లక్షల రైతు రుణమాఫీ, రాష్ట్ర విజభన అంశాలపై కేబినెట్ భేటీలో చర్చించవద్దని ఎన్నికల కమిషన్ ఆదేశించడంతో.. దీనిపై డిస్కషన్ జరగలేదు.

# బోనస్.. పెద్ద బోగస్

(మొదటిపేజీ తరువాయి)

అలా కాకుండా కేవలం సన్న రకాలకే బోనస్ ఇస్తాం, అదీ వచ్చే సీజన్ నుంచి ఇస్తామనడం రైతులను దగా చేయడమేనని హరీష్ రావు మండిపడ్డారు. తాజాగా మంత్రుల ప్రకటనతో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల సంక్షేమం పట్ల, వ్యవసాయాభివృద్ధి పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదని స్పష్టమైపోయిందని తేల్చి చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అధికారంలోకి రావాలనే దురుద్దేశంతో ఇచ్చినవే తప్ప రైతుల మేలు కోసం చేసే కార్యక్రమాలు కావని స్పష్టం అయిందన్నారు. ఎకరానికి రూ.15,000 రైతు భరోసా సాయం ఇస్తామని, వ్యవసాయ కూలీలకు రూ.12వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తామనే హామీలను కూడా ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు చేయని విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నానన్నారు. రెండు లక్షల రూపాయల రుణమాఫీ గురించి కూడా వాయిదాలు పెట్టడమే తప్ప నేటి వరకు అమలు చేసింది లేదని స్పష్టం చేశారు. కేవలం సన్న వడ్లకే బోనస్ ఇస్తామనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సీజన్ నుంచే అన్ని రకాల వడ్లకు రూ.500 చొప్పున బోనస్ చెల్లించాలని రైతుల పక్షాన ప్రభుత్వాన్ని కోరారు.



# బోర్డ్ తిప్పేసిన ఫైనాన్స్ కంపెనీ

- రూ. 200 కోట్లతో ఉడాయించిన శ్రీ ప్రియాంక ఎంటర్‌ప్రైజెస్
- అధిక వడ్డీలు ఇస్తామని నమ్మబలికిన కంపెనీ
- 'ప్రియాంక'లో పెట్టుబడులు పెట్టిన 517 మంది
- ఏజెంట్లను పెట్టి ప్రజల దగ్గరా వసూలు చేసిన ఫైనాన్సర్లు
- రాత్రికి రాత్రే బోర్డు తిప్పేసిన ఫైనాన్స్ కంపెనీ
- బషీర్‌బాగ్ సీసీఎస్ పీఎస్‌లో బాధితుల ఫిర్యాదు

**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్‌లో రోజుకో ఘరానా మోసం బయటకు వస్తుంది. రాత్రి పగలు కష్టపడి, చెమడోడ్చి సంపాదించిన సొమ్మునంతా చాలా మంది దోపిడీ దారుల చేతులో పెడుతున్నారు. తక్కువ ధరకే ఫ్లాట్లు ఇస్తామని నమ్మించి ఏకంగా రూ.80 కోట్లు దోచేసిన ఘటన నిన్న వెలుగులోకి వచ్చింది. ఎక్కువ వడ్డీ రేట్ల పేరుతో రూ.200 కోట్లు స్వాహ చేసిన ఘటన ఇవాళ బయటపడింది. దాచి.. దాచి దెయ్యాల పాలు చేసినట్లు.. సామాన్యులు చాలా మంది ప్రైవేట్ కంపెనీల మాయలో పడుతున్నారు. తమ దగ్గర పెట్టుబడి పెడితే అధిక వడ్డీలు చెల్లిస్తామని అబిడ్స్‌లోని శ్రీ ప్రియాంక ఎంటర్‌ప్రైజెస్ పేరుతో ఉన్న ఓ సంస్థ నమ్మబలికింది. ఈ మాటలు నమ్మిన సామాన్యులు పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టారు. అధిక వడ్డీలకు ఆశపడి ఏకంగా రూ.200 కోట్లు ఆ కంపెనీ చేతిలో పెట్టారు. పెట్టుబడుల దారులను ఆకర్షించడానికి ఆ కంపెనీ ఏజెంట్లను కూడా నియమించింది. ఏజెంట్లతో పెద్ద వ్యవస్థ ఉండటంతో ప్రజలు ఈజీగా నమ్మేశారు. రూ. 200 కోట్లు వసూలు అయిన తర్వాత రాత్రికి రాత్రే ఆ కంపెనీ ప్రతినిధులు బోర్డు తిప్పేశారు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన బాధితులు బషీర్‌బాగ్ సీసీఎస్ పీఎస్‌లో ఫిర్యాదు చేసి అక్కడే ఆందోళన చేపట్టారు. దాదాపు 517 మంది శ్రీ ప్రియాంక ఎంటర్‌ప్రైజెస్‌లో పెట్టుబడులు పెట్టినట్టు పోలీసులు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, నిందితుల కోసం గాలిస్తున్నారు.

# 20 అడుగుల లోయలో పడ్డ బస్సు

- 19మంది మృతి, 8మందికి తీవ్ర గాయాలు
- మృతుల్లో 17 మంది మహిళలు
- తునికాకు సేకరణకు వెళ్లి వస్తుండగా ప్రమాదం
- ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి సంతాపం

**విశ్వంభర, కుక్దూర్, మే 20 :** ఛత్తీస్‌గఢ్‌లోని కవర్ధలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. తునికాకు సేకరణకు వెళ్లి తిరిగి వస్తున్న గిరిజనుల వాహనం అదుపుతప్పి 20 అడుగుల గుంతలో పడిపోయింది. ఈ ఘటనలో సుమారు 19మంది మరణించారు. ఇందులో 17మంది మహిళలతో పాటు డ్రైవర్ ఉన్నాడు. కాగా మరో ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. కుక్దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బహ్పని గ్రామ సమీపంలో ఈ ఘటన జరిగింది. ప్రమాద సమయంలో వాహనంలో సుమారు 40 మంది ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్ట్‌మార్టమ్ పరీక్షల కోసం పంపించారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తు న్నారు.

### సీఎం విష్ణుదేవ్ సాయి సంతాపం

ప్రమాద ఘటనపై చత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి సంతాపం వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించినట్లు వెల్లడించారు. ఉపముఖ్యమంత్రి విజయ్ శర్మ సైతం తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. క్షతగాత్రులు వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితులకు అవసరమైన సాయం చేసేందుకు అధికారులను ఆదేశించామని చెప్పారు.

# ప్రశాంతంగా ముగిసిన ఐదో విడత పోలింగ్

- 6 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటింగ్ పూర్తి
- 49 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఓటు హక్కు వినయోగించుకున్న ఓటర్లు
- ఓటేసేందుకు క్యూ కట్టిన సినీనటులు

**విశ్వంభర, హైదరాబాద్ :** లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఐదోవిడత పోలింగ్ ముగిసింది. 6 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 49నియోజకవర్గాల్లో ఓటింగ్ జరిగింది. ఈ విడతలో ఉత్తరప్రదేశ్‌లోని 14 స్థానాలు, మహారాష్ట్ర 13, బంగాల్ 7, బిహార్, ఒడిశాలో 5చొప్పున, ఝూరండ్ 3, జమ్ముకశ్మీర్, లద్దాఖ్‌లో ఒక్కో నియోజకవర్గంలో ఓటింగ్ జరిగింది. జమ్ముకశ్మీర్‌లో ప్రజలు తెల్లవారుజాము నుంచే ఓటింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉండటం వల్ల సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్ఠ భద్రత మధ్య పోలింగ్ నిర్వహించారు. బారాముల్లా పార్లమెంటరీ నియోజకవర్గంలో ఎన్‌సీ అభ్యర్థి, మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా, పీడీపీ అభ్యర్థి మీర్ మహ్మద్ ఫయాజ్, జేకేపీసీ అభ్యర్థి సజాద్ లోన్‌ల మధ్య పోటీ నెలకొంది.

### ఓటేసేందుకు సినీనటులు క్యూ

అమేథీ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్న కేంద్రమంత్రి స్మృతి ఇరానీ గౌరీగంజ్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిందే, శివసేన నేతలు ఉద్ధవ్‌ఠాక్రే, వ్యాపారవేత్తలు రతన్ టాటా, ముకేష్ అంబానీ, అనిల్ అంబానీ తదితరులు కుటుంబాలతో కలిసి ఓటు వేశారు. ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్, హాకీ ఇండియా చీఫ్ దిలీప్ టిర్కీ ఓటు వేశారు. క్రికెటర్ సచిన్ టెండూల్కర్, కుమారుడితో కలిసి, అజింక్య రహానే భార్యతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. నటులు అమితాబ్ బచ్చన్, జాన్వీ కపూర్, దర్శకుడు జోయా అక్తర్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. రకుల్ ప్రీత్ సింగ్, జాకీ బాగ్నానీ, సంజయ్ దత్, మనోజ్ బాజ్‌పేయ్, అనిల్ కపూర్, హేమా మాలిని తదితరులు పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకుని, ఓటు ఆవశ్యకతను వివరించారు. నాసిక్‌లో స్వతంత్ర అభ్యర్థి శాంతిగిరి మహారాజ్ పోలింగ్ బూత్‌లో ఓటు వేసిన తర్వాత ఓటింగ్ యంత్రానికి పూలమాల వేశారు.

### అమేథీ, రాయ్‌బరేలీపైనే ఫోకస్

ఈ విడతలో పలు హై ప్రొఫైల్ నియోజకవర్గాలు ఉన్నాయి. రాయ్‌బరేలీలో రాహుల్ గాంధీతో బీజేపీ నేత దినేష్ ప్రతాప్ సింగ్ తలపడుతున్నారు. అమేథీలో స్మృతి ఇరానీ, కాంగ్రెస్ నేత కిషోర్ లాల్ శర్మ మధ్య పోటీ నెలకొంది. లఖ్‌నవూలో రాజ్‌నాథ్‌సింగ్, వర్సెస్ సమాజ్‌వాదీ నేత రవిదాస్ మహరోత్రా ప్రత్యర్థులుగా ఉన్నారు. పియూష్ గోయల్, రోహిణి ఆచార్య, చిరాగ్ పాసవాన్, ప్రముఖ న్యాయవాది ఉజ్వల్ నికమ్ వంటి ప్రముఖుల భవితవ్యం ఐదో విడతలో తేలనుంది. మొత్తం 695మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

8.95 కోట్ల మంది ఓటర్లు ఉండగా వారిలో 4.26 కోట్ల మంది మహిళలు ఉన్నారు. 5 వేల 409మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నట్లు ఈసీ తెలిపింది. వారి కోసం 94వేల 7వందల 32 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. 543 లోక్‌సభ స్థానాలకు గానూ ఐదో విడత పోలింగ్‌తో 428 నియోజకవర్గాల్లో పోలింగ్ పూర్తయింది. ఒడిశాలోని 35 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ విడతలోనే పోలింగ్ జరిగింది. మే 25న ఆరో విడత, జూన్ 1న ఏడో విడత పోలింగ్ జరగనుంది.

# డయాలసిస్ బాంబ్

## చందంపేటను చుట్టుముట్టింది

**విశ్వంభర, నల్లగొండ బ్యూరో:** అది దేవరకొండ నియోజకవర్గంలో మారుమూల మండలం చందపేట. అక్కడి ప్రకృతి ఖనిజ సంపద మీద పాలకులు, అధికారులకు ఉన్న సోయి.. ప్రజలపై కాసింతైనా లేదు. ఓవైపు ఫ్లోరైడ్ రక్కసి.. మరోవైపు మైనింగ్, క్రషర్ మిల్లుల కాలుష్యం.. వెరసి అక్కడి ప్రజలు అనారోగ్యంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. స్థానిక ప్రజలు మమ్మల్ని కాపాడండి మహాప్రభో అంటూ ఎంతమంది పాలకులు, అధికారులను వేడుకున్నా.. ఫలితం మాత్రం శూన్యం. అక్కడి ఏ ఇంట్లో చూసినా మూత్రపిండాల సంబంధిత వ్యాధితోనో.. శ్వాసకోస సమస్యలతోనో బాధపడే రోగుల సంఖ్య వెరీ కామన్. ప్రధానంగా చందంపేట మండల వాసులను డయాలసిస్ వ్యాధి చుట్టుముట్టేసింది. ఒక్క చందంపేట మండలంలోనే ఒక్కరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 50 మందికి పైగా డయాలసిస్ పేషంట్లు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. అనధికారికంగా మరో 10 వరకు హైదరాబాద్ నగరంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటున్నారని సమాచారం. అయితే ఇంతలా చందంపేట మండలం వాసులు డయాలసిస్ బారిన పడడానికి ప్రధాన కారణం మైనింగ్, క్రషర్ మిల్లులే. మైనింగ్, క్రషర్ మిల్లుల మీద వచ్చే ఆదాయంపై ఉన్న శ్రద్ధ.. ప్రజల ఆరోగ్యాలపై లేకపోవడం నిజంగా బాధకరమే.

### దేవరకొండ డివిజన్‌లోనే అత్యధిక క్రషర్ మిల్లులు..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే అత్యధికంగా మైనింగ్, క్రషర్ మిల్లులు దేవరకొండ డివిజన్‌లో ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో గతేడాది 500 మంది రోగులు చికిత్స తీసుకుంటే.. ప్రస్తుతం ప్రతి రోజూ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో 700 మందికి పైగా డయాలసిస్ చేయించుకుంటున్నారు. మైనింగ్, క్రషర్ మిల్లుల పుణ్యమంటూ నీరు కలుషితంగా మారడంతో పాటు దుమ్ము, ధూళి ద్వారా చిన్న చిన్న కాలుష్య రేణువులు పీల్చడం వల్ల బాధితుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. వీటికితోడు గుట్ట ప్రాంతల్లో నివసించే వారు ఫ్లోరోసిస్ శాతం అధికంగా ఉన్న నీటిని తాగడంతోనూ ఇలాంటి సమస్యలు ఉత్పన్నం అవుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. అయితే దేవరకొండలోని డయాలసిస్ కేంద్రానికి చందంపేట మండలం నుంచి రోగులు అధికంగా వస్తున్నట్టు దేవరకొండ ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాములునాయక్ తెలిపారు. గత ఏడాదిలో రోగుల సంఖ్య 20 మంది ఉంటే.. ప్రస్తుతం 50 మందికి చేరినట్టు చెప్పారు.

### మూఢనమ్మకాలు, శిశు విక్రయాలకు కేరాఫ్ అడ్రస్..

ఒక్క మాటలో చెప్పాలంటే.. చందంపేట ఛిద్రమైన మండలం. ఇప్పుడు కొంతమేర పరిస్థితి చెప్పుకోదగిన విధంగా ఉంది. కానీ ఏడాది క్రితం వరకు మూఢనమ్మకాలు, శిశు విక్రయాలు, భ్రూణ హత్యలు, నిరక్షరాస్యత వేళ్లూనుకుపోయిన ప్రాంతం. అధికారగణం, ప్రజాప్రతినిధులు ఈ తీరును కళ్ళప్పగిస్తూ చూస్తూ కాలం గడుపుతున్నారే తప్ప కారణాలు అన్వేషించడం లేదు. తమకెందుకులే అనుకుంటున్నారు తప్ప తాము సైతం అనుకోవడం లేదు. నీటి కోసం అల్లాడే గ్రామాలు, కరెంటు లేక దీపాల వెలుగులో ఉన్న తండాలు, రోడ్లు లేక ఇంకా అడవి బాటన ప్రయాణించాల్సిన ఆవాసాలు, బడి కోసం మైళ్ల దూరం నడిచే విద్యార్థులు, సంక్షేమ హాస్టళ్లలో అడ్మిషన్ దొరక్క చదువు మానేసిన పిల్లలు, వ్యవసాయం కలిసిరాక వలసవెళ్లే కుటుంబాలు, రోగమొస్తే ప్రాణాలమీదికి తెచ్చుకునే గిరిజనులు అడుగడునా కనిపిస్తారు. ఇదంతా అధికారులకు తెలియనిదా ? ఇది ప్రభుత్వం దృష్టికి పోవడం లేదా ? అన్న ప్రశ్న జిల్లా ప్రజలను తొలచివేస్తుంది.

### నేటికీ వలస పోయేటేళ్లే 40శాతం మంది..

చందంపేట మండలం మారుమూల ప్రాంతం కావడం.. పాలకులు పెద్దగా పట్టించుకోకపోవడం.. రాజకీయ నేతల స్వార్థం.. ఫలితంగా ఇంకా సమస్యల్లోనే కొట్టుమిట్టాడుతోంది. అక్కడి ప్రజలకు బతుకుదెరువు లేక.. వ్యవసాయం కలిసిరాక.. పిల్లల్ని సాకలేక వలస వెళ్తున్న వారు 40శాతం పైనే ఉన్నారు. సుమారు 57వేల జనాభా ఉన్న మండలంలో ఇప్పటికీ సుమారు 20వేల మంది గుంటూరు, హైదరాబాద్, ముంబై వంటి ప్రాం తాల్లో ఉంటున్న వారే. పండుగకో, పబ్బానికో, ఓట్ల సమయంలో సొంతూళ్లకు వచ్చిపోతుంటారు.

# ఒడిశాలో తొలిసారి బీజేపీ ప్రభుత్వం రాబోతోంది

విశ్వంభర, కటక్ : అవినీతిపై ఒడిశాలోని బిజూ జనతాదళ్ ప్రభుత్వాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి తప్పుపట్టారు. రాష్ట్రానికి ప్రభుత్వం కేవలం ల్యాండ్ మాఫియా, ఇసుక మాఫియా, బొగ్గు మాఫియా, మైనింగ్ మాఫియాలను ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో తొలిసారి బీజేపీ ముఖ్యమంత్రిని ఎన్నుకోనుండటం ద్వారా ప్రజలు కొత్త చరిత్రను సృష్టించబోతున్నారని ఆయన జోస్యం చెప్పారు. కటక్‌లో సోమవారంనాడు జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ, రాష్ట్రంలో హంగ్ అసెంబ్లీ వస్తుందని మీడియా చెబుతోందని, కానీ అది నిజం కాదని అన్నారు. ఒడిశాలో ప్రభుత్వాన్ని బీజేపీ ఏర్పాటు చేస్తుందన్నారు. బీజేడీ రాష్ట్రానికి ఏదైనా ఇచ్చి ఉంటే అది భూ మాఫియా, ఇసుక, బొగ్గు, మైనింగ్ మాఫియా మాత్రమేనని అన్నారు.

### జూన్ 10న ఒడిశాలో ప్రమాణస్వీకారం..

"మహిళలు పెద్ద సంఖ్యలో ఇక్కడకు విచ్చేశారు. మొదటిసారి ప్రజల్లో ఎంతో ఉత్సుకత కనిపిస్తోంది. 25 ఏళ్ల తర్వాత కనిపిస్తున్న ఈ ఉత్సాహం చూస్తుంటే ఒడిశా కొత్త చరిత్రను సృష్టించడం ఖాయమైనట్టే. జూన్ 10న ఒడిశాలో బీజేపీ తొలి ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం చేయడం తథ్యం. మీ అందరి ఆశీస్సులతో మోదీ ప్రభుత్వం ఢిల్లీలో మూడోసారి ప్రమాణస్వీకారం చేస్తుంది" అని మోదీ అన్నారు. ఒడిశాలోని అధికార బీజేడీ ప్రభుత్వంపై మోదీ విరుచుకుపడుతూ, కటక్ ప్రజల సమస్యలు బీజేడీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కటక్ చుట్టూ నదులున్నా తాగునీటి సమస్య ఉందని, ట్యాపుల ద్వారా నీళ్లు ఇవ్వాలని తాను కోరుకున్నప్పటికీ వాళ్లు అడ్డుకున్నారని ఆరోపించారు. బీజేడీ తప్పిదాలను ఈ ఎన్నికల్లో ప్రజలు శిక్షించబోతున్నారని, బీజేపీ ప్రభుత్వం తప్పుదాలు, ప్రజలను లూటీ చేయడం పూర్తిగా ఈ ఎన్నికల్లో బయటపడ్డాయని చెప్పారు. బీజేడీ అవినీతితో యువత బాగా నష్టపోయిందని, వలసలు పోతున్నారని, పెట్టుబడులకు అవసరమైన వాతావరణాన్ని ప్రభుత్వం సృష్టించడంలేదని, ప్రతి రంగాన్ని ఆక్రమించిన మాఫియా ఇక్కడకు ఎలాంటి పోటీని అనుమంతిచడం లేదని అన్నారు. రాష్ట్రాన్ని దయనీయ స్థితిలోకి బీజేడీ నెట్టేసిందని అన్నారు. ఈ ఎన్నికలు చాలా విలువైనవనీ, రాష్ట్రాన్ని ధ్వంసం చేసిన వారందరినీ శిక్షించాలని పిలుపునిచ్చారు. కాగా, దీనికి ముందు కటక్‌లో మోదీ రోడ్‌షో నిర్వహించారు.

# అర్ధరాత్రి రేవ్ పార్టీ

**విశ్వంభర, హైదరాబాద్ :** బెంగళూరు శివారులో ఉన్న ఓ ఫామ్‌హౌస్‌లో హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఏర్పాటు చేసిన రేవ్ పార్టీ గుట్టును పోలీసులు రట్టు చేశారు. సీసీబీ పోలీసుల బృందం దాడి చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ పార్టీకి ఆంధ్రప్రదేశ్, బెంగళూరు కు చెందిన 100 మందికి పైగా ప్రముఖులు హాజరైనట్లు పోలీసులు గుర్తించారు. ఇందులో పలువురు తెలుగు టీవీ నటీనటులు, మోడళ్లు ఉన్నారని నిర్ధారించారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన వాసు అనే వ్యక్తి తన బర్త్‌డే పార్టీని బెంగళూరు శివారులోని ఓ వ్యాపారికి చెందిన ఫామ్‌హౌస్‌లో ఏర్పాటు చేసుకున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న సీసీబీ యాంటీ నార్కోటిక్ బృందం దాడులు నిర్వహించింది. ఈ తనిఖీల్లో బెంగళూరు, ఆంధ్రప్రదేశ్ నుంచి 100 మందికి పైగా ప్రముఖులు పాల్గొన్నట్లు గుర్తించారు. అలాగే పలువురు తెలుగు సినిమా, టీవీ నటీనటులు, మోడళ్లు ఉన్నట్లు నిర్ధారించారు. ఈ క్రమంలోనే 17 గ్రాముల ఎండీఎంఏ పిల్స్, కొకైన్‌తో పాటు మెర్సిడెస్ బెంజ్, ఆడి, జాగ్వార్ సహా 15 ఖరీదైన కార్లు స్వాధీనం చేసుకున్నారు. ఒక కారులో ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యే స్టిక్కర్‌ను గుర్తించారు. ఈ ఘటనలో ఐదుగురిని అరెస్టు చేసిన ఎలక్ట్రానిక్ సిటీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

### మాకు ఎలాంటి సంబంధం లేదు

మరోవైపు ఈ పార్టీలో తెలుగు సినీనటి హేమ, నటుడు శ్రీకాంత్ కూడా పాల్గొన్నారనే వదంతులు వినిపించాయి. ఈ ఆరోపణలను వారిద్దరు ఖండించారు. ఆ రేవ్ పార్టీతో తనకు ఎలాంటి సంబంధం లేదని వారు స్పష్టం చేశారు. ఈ విషయంపై హేమ, శ్రీకాంత్ వేర్వేరుగా ప్రత్యేక వీడియోలను విడుదల చేశారు. తాము ఎక్కడకు వెళ్లలేదని చెప్పారు. హైదరాబాద్‌లోనే ఉన్నామన్నారు. తమపై వస్తోన్న వార్తలను నమ్మవద్దని, అవి ఫేక్ న్యూస్ అని పేర్కొన్నారు. అక్కడ ఎవరు ఉన్నారో తనకు తెలియదని వివరించారు.
దయచేసి మీడియాలో తనపై వచ్చే వార్తలను నమ్మకండని విజ్ఞప్తి చేశారు.

# కవితకు మళ్లీ నిరాశే..

- జ్యుడిషియల్ రిమాండ్‌ను పొడిగించిన కోర్టు
- జూన్ 3 వరకు కవిత రిమాండ్‌ను పొడిగిస్తూ ఉత్తర్వులు

**విశ్వంభర, న్యూఢిల్లీ :** ఢిల్లీ మద్యం విధానంలో తిహార్ జైల్లో ఉన్న ఎమ్మెల్సీ కవితకు మరోసారి నిరాశ ఎదురైంది. ఆమె జ్యుడిషియల్ కస్టడీ మళ్లీ పెరిగింది. జూన్ 3 వరకు కవిత రిమాండ్‌ను పొడిగిస్తూ ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈడీ, సీబీఐ కేసుల్లో ఇప్పటికే ఆమె కస్టడీలో ఉండగా పొడిగించాలని దర్యాప్తు సంస్థలు కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. దీనిపై విచారణ చేపట్టిన సీబీఐ ప్రత్యేక కోర్టు జూన్ మూడో తేదీ వరకు రిమాండ్‌ను పొడిగించింది. ఢిల్లీ మద్యం విధానం కేసులో కవిత సహా నలుగురిపై దాఖలు చేసిన ఛార్జిషీట్‌పై ఇవాళ కోర్టులో వాదనలు జరిగాయి. ఐదుగురు నిందితుల పాత్రపై ఆధారాలు పొందుపరిచామని కోర్టులో ఈడీ పేర్కొంది. కవిత, దామోదర్, ప్రిన్స్ కుమార్‌తో పాటు మరో ఇద్దరిపై ఏడో ఛార్జిషీట్ దాఖలు చేసినట్లు వివరించింది. తొలుత కవిత పాత్రపై వాదనలు వినిపించేందుకు ఈడీ సిద్ధమవ్వగా ఆమె పాత్ర మినహా మిగతా నలుగురి పాత్ర గురించి వివరించాలని జడ్జి ఆదేశించారు.

# టీపీసీసీ చీఫ్ ఎవరు..?

- అధ్యక్ష పదవి రేసులో కీలక నేతలు
- ఒసులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- నాకే పార్టీ పగ్గాలు ఇవ్వాలంటున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి
- బీసీ సామాజిక వర్గం నుంచి మధుయాష్కీ గౌడ్, మహేష్ కుమార్ గౌడ్, అంజన్ కుమార్ యాదవ్
- షబ్బీర్ అలీ, మంత్రి సీతక్క పేర్లూ పరిశీలన

**విశ్వంభర, హైదరాబాద్ :** కాంగ్రెస్‌లో పీసీసీ పదవికి ఉన్న క్రేజ్ అంతాఇంతా కాదు. అది పార్టీ పదవి అయినప్పటికీ.. సీఎంతో సమానంగా పార్టీలో హోదా ఉంటుంది. దీంతో.. ఆ పదవి కోసం చాలా మంది తీవ్ర ప్రయత్నాలు చేస్తారు. కొంతమంది అయితే.. మంత్రి కాకపోయినా పర్వాలేదు.. పీసీసీ చీఫ్ అయితే చాలు అనుకుంటారు. ఇక త్వరలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్ పదవికి రాజీనామా చేయనున్నారు. దీంతో.. కొత్త కమిటీని ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించిన అధిష్టానం కూడా ఎప్పుడో క్లారిటీ ఇచ్చింది.

### రెడ్డిలకు నో చాన్స్..

పార్లమెంట్ ఎన్నికలు కూడా ముగిసాయి కాబట్టి ఫలితాలు వచ్చిన తర్వాత కొత్త కమిటీ ఏర్పాటుపై కాంగ్రెస్ పార్టీ ఫోకస్ చేయనుంది. జూన్ నెలాఖరులో స్థానిక సంస్థల ఎన్నికలు కూడా ఉన్నాయి కాబట్టి.. ఆ లూపే కొత్త అధ్యక్షుడిని నియమించే ఛాన్స్ ఉంది. దీంతో ఆశావహులు పార్టీ అధ్యక్ష పదవి కోసం ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలు పెట్టారు. టీపీసీసీ పదవి రేసులో చాలా మంది ఉన్నారు. ఈసారి రెడ్డి సామాజికవర్గానికి ఈ పదవి ఇవ్వరని టాక్ నడుస్తోంది. దీంతో.. ఎస్సీ సామాజికవర్గానికి ఇస్తే మొదటి వరుసలో భట్టి విక్రమార్క ఉంటారు. ఆయన సీఎం పదవిని ఆశించారు. అది రేవంత్ రెడ్డికి వెళ్లడంతో పార్టీ పగ్గాలు తనకు ఇవ్వాలని ఎప్పుటి నుంచో ప్రయత్నాలు మొదలు పెట్టారు.

### బీసీ సామాజిక వర్గం నుంచి గట్టి పోటీ

ఒకవేళ బీసీ సామాజిక వర్గానికి ఇవ్వాల్సి వస్తే మధుయాష్కీ గౌడ్, మహేష్ కుమార్ గౌడ్, అంజన్ కుమార్ యాదవ్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వీరిలో మధుయాష్కీగౌడ్‌కి రాహుల్ గాంధీతో మంచి సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. కాబట్టి బీసీలకు ఇస్తే మొదట మధుయాస్కీ పేరు పరిశీలించే అవకాశం ఉంది. ఒకవేళ.. మైనార్టీల నుంచి ఇవ్వాలనుకుంటే షబ్బీర్ అలీ వైపే అధిష్టానం మొగ్గు చూపుతుందని హస్తం పార్టీలో చర్చ జరుగుతోంది. ఎస్టీ సామాజికవర్గానికి ఇవ్వాలనుకుంటే మాత్రం మంత్రి సీతక్క పేరు వినిపిస్తోంది.

### మంత్రి పదవి ఇవ్వలే కదా..

ఇక మరోసారి రెడ్డి సామాజికవర్గం చేతిలోనే పార్టీ పగ్గాలు పెట్టాల్సి వస్తే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఈ పదవిని అడుగుతారని చర్చ నడుస్తోంది. ఆయన మొదటి నుంచి మంత్రి పదవిని ఆశిస్తున్నారు. తన అన్న వెంకటరెడ్డికి మంత్రి పదవి దక్కడంతో ఆయనకు చాన్స్ రాలేదు. దీంతో.. పీసీసీ పదవి అయినా ఇవ్వాలని రాజగోపాల్ రెడ్డి అడిగే చాన్స్ ఉంది.

# ఆరు నెలల్లో రేవంత్ ప్రభుత్వం రూ.12,905 కోట్ల అప్పు



## తీన్మార్ మల్లన్నకు వేసే ఓటు సమాజానికి ఉపయోగపడుతుంది

**పిఆర్టియు తెలంగాణ మద్దతు తీన్మార్ మల్లన్నకే**
**పిఆర్టియు తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షులు గాలి రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి**

**సూర్యాపేట :** ఖమ్మం,వరంగల్, నల్లగొండ కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు పట్టభద్రులు వేసే ప్రతి ఓటు సమాజానికి ఉపయోగపడుతుందని పిఆర్టియు తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షులు గాలి రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రం మినీ ట్యాంక్ బండ్ పై సాయంత్రం వాకర్స్ పట్టభద్రులకు అవగాహన కల్పించి మాట్లాడారు. కోవిడ్ సమయంలో ఉపాధ్యాయులు ఉద్యోగుల సమస్యలపై స్పందించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన వ్యక్తి తీన్మార్ మల్లన్న అన్నారు. తీన్మార్ మల్లన్న గెలిస్తే టీఎస్పీఎస్సీ ఉద్యోగుల క్యాలెండర్ను విజయవంతంగా అమలు చేస్తాడన్నారు. నిరుద్యోగులు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రిని కలసి పరిష్కరించాలంటే అది ఒక తీన్మార్ మల్లన్నతోనే సాధ్యమవుతుందన్నారు. పట్టభద్రులు ఆలోచించి సమాజానికి ఉపయోగపడే ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు ఎం. రామ్మోహన్, జిల్లా సెక్రెటరీ ఉపేందర్, గౌరవ అధ్యక్షులు కోడి వెంకటయ్య, , శ్రీనివాస్ రెడ్డి, రమేష్, ఆచారి, ఆంజనేయులు, ఎం రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

- గరిష్ట స్థాయికి చేరిన ఎఫ్ఆర్బీఎం పరిమితి
- కొత్త కార్పొరేషన్లతో భారీ రుణాలకు యత్నం
- అప్పులు కట్టడానికి మరిన్ని అప్పులు
- ప్రభుత్వ భూముల అమ్మకానికి శ్రీకారం
- రాష్ట్రాల ఆర్థిక స్థితిని గాడిలో పెట్టడానికి ఆర్బీఐ కొత్త మార్గదర్శకాలు రూపొందించాలి
- కేంద్ర ఆర్థిక మంత్రికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ వినతి



**విశ్వంభర, న్యూ డిల్లీ మే 20 :** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి శ్రీమతి నిర్మల సీతారామన్ ను సోమవారం బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉప్పల్ మాజీ శాసనసభ్యుడు ఎన్.వి.ఎస్.ఎస్ ప్రభాకర్ న్యూఢిల్లీలో కలిశారు. ఇటీవల రాష్ట్రంలో లోక్ సభ ఎన్నికల వివరాలను మంత్రికి ఆయన వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలలు తిరగకముందే 12,905 కోట్ల రూపాయల అప్పు కొత్తగా చేసిందని. ఎఫ్ఆర్బీఎం పరిమితి గరిష్ట స్థాయికి చేరిందని ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ఏతర రుణాల మీద దృష్టి సారించిందని, బహిరంగ మార్కెట్లో రుణాలు సేకరించడానికి సిద్ధమవుతుందని ప్రభాకర్ వివరించారు. గత ప్రభుత్వం అనేక కార్పొరేషన్ల ద్వారా రుణాలు పొందగా, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మరిన్ని కొత్త కార్పొరేషన్లను ఏర్పాటు చేసి భారీ స్థాయిలో రుణాలని పొందటానికి ప్రయత్నాలు ఆర్థిక పరిస్థితిని మరింత దిగజారుస్తుందన్నారు. అప్పులు కట్టడానికి మరిన్ని కొత్త అప్పులు చేయవలసిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ భూములు అమ్మటానికి ఇప్పటికే శ్రీకారం చుట్టారని మరిన్ని భూములు అమ్మడం కొరకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు ప్రభుత్వం నియమిస్తున్న సలహాదారుల, కార్పొరేషన్ చైర్మన్ ల రాజకీయ నియామకాలతో ప్రభుత్వ ఖజానా గుల్లవుతుందని చెప్పారు. కేంద్ర ఆర్థిక సంఘం స్థానిక సంస్థలకు అందిస్తున్న నిధులను కూడా ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తూ స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్న దుస్థితిని కేంద్ర మంత్రికి ప్రభాకర్ వివరించారు. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టడానికి రిజర్వ్ బ్యాంక్ ద్వారా కొత్త మార్గదర్శక సూత్రాలు రూపొందించాలని కోరారు.

## ప్రేమ పేరుతో రూ.16 లక్షలు దండుకొని ఆస్ట్రేలియా చెక్కేసిన యువతి



**విశ్వంభర, కరీంనగర్ :** శివయ్య సాక్షిగా పరిచయం అయ్యారు. ఆ పరిచయం ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుందామని ప్రియురాలు చెప్పడంతో ప్రియుడు ఉబ్బితబ్బిబ్బు పోయాడు. ఆ ఆనందానికి అంతే లేకుండా పోయింది. అవసరాల కోసం ప్రియురాలికి డబ్బు ఖర్చు చేయడం మొదలు పెట్టాడు. ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా 16 లక్షలు ఆ అమ్మాయికి ఇచ్చాడు. చివరికి ఆ అమ్మాయి యువకుడికి హ్యాండ్ ఇచ్చింది. దీంతో.. ప్రియుడు మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం చేశారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌కు ఈ ఘటన చోటు చేసుకుంది. తిమ్మాపూర్‌కు చెందిన నాగరాజు యోగ నిమిత్తం ఈశా ఫౌండేషన్‌కు వెళ్లాడు. అక్కడ వైజాగ్‌కి చెందిన సంధ్య ప్రియాంక అనే యువతితో పరిచయం అయింది. కొన్ని రోజులు తరువాత ఆ పరిచయం ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించిన సంధ్య.. నాగరాజుతో పెద్ద ఎత్తున ఖర్చు పెట్టించడం మొదలు పెట్టింది. అంతేకాదు.. తన అవసరాల కోసం డబ్బు కావాలని ఏకంగా రూ. 16 లక్షలు దండుకుంది. సంధ్య ఆ డబ్బును తన బంధువుల ఖాతాలోకి జమ చేయించుకుంది. డబ్బు అందిన తర్వాత ఆస్ట్రేలియాకు వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న నాగరాజు మనస్తాపంతో ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు నాగరాజుని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సంధ్యాపై ఎల్ఎండీ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.



## వర్షాల కారణంగా మేడిగడ్డ పనులకు బ్రేక్

**విశ్వంభర, మహాదేవపూర్ :** కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్రధాన బ్యారేజ్ మేడిగడ్డ, పనులకు బ్రేక్ పడింది. గత రెండు రోజులుగా భారీ వర్షాలు పడటంతో అధికారులు పనులను నిలిపివేశారు. డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఆదేశాల అనుసారం పనులు కొనసాగిస్తున్న ఇరిగేషన్ అధికారులు సెక్టర్ 7 లోని 16వ గేటును ఎత్తివేయడం జరిగింది. సోమవారం రోజు 15 గేటు ఎత్తివేయాల్సి ఉండగా వర్షాలు కురవడంతో పనులు చేపట్టి పరిస్థితి లేకపోవడంతో మేడిగడ్డ పనులను ఆపివేశారు. గత ఐదు రోజుల నుండి మేడిగడ్డ బ్యారేజ్ ఎగువ, దిగువ పిల్లర్ల వద్ద పేరుకుపోయిన, మట్టిని తొలగించడం జరుగుతుంది. అలాగే పిల్లర్ల లిఫ్ట్ క్రింద ఉన్నటువంటి రంధ్రాల్లో కాంగ్రెట్, సిమెంట్‌తో గ్రౌండింగ్ పనులు కొనసాగించడంతో పాటు షీట్ ఫైల్స్ వేయుటకు సిద్ధం కావడం జరిగింది. వర్షాలు కురవడంతో బ్యారేజీ వద్ద నీరు రావడం వలన అధికారులు పనులు కొనసాగించే పరిస్థితి లేదు, మరోవైపు అధికారులందరూ ఇరిగేషన్ శాఖ సమీక్ష సమావేశానికి వెళ్లడం తో మేడిగడ్డ బ్యారేజీ పనులు ప్రారంభించడానికి మరో రెండు మూడు రోజులు సమయం పట్టొచ్చు.



## అర్ధరాత్రి ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను అడ్డుకున్న యువకులు

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) మే 20 :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం కొరటికల్ బిక్కేరు వాగు వద్ద నూతనంగా నిర్మిస్తున్న చెక్ డ్యాం నిర్మాణం కోసం వాగులో ఉన్న ఇసుకను తోడి కాంట్రాక్టర్ పెద్ద కుప్పలుగా పోసి పెట్టాడని ఇసుక ఇంత ఆవసరమవుతుందా అని ప్రశ్నించిన గ్రామస్తులకు ఇది సరిపోదు అని సమాధానం చెప్పి అర్ధరాత్రి సమయాలలో ఇతర ప్రాంతాలకు ఇసుకను అమ్ముతూ కాంట్రాక్టర్ సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. ఆదివారం అర్ధరాత్రి ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను ఆత్మకూర్(ఎం) గ్రామంలో శివాజీ యూత్ సెక్యూరిటీ వాలంటీర్లు అడ్డుకున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. అధికారుల అండదండలతోనే ఇంత ధైర్యంగా అర్ధరాత్రి ఇసుకను తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



## కాగజ్‌నగర్‌లో జర్నలిస్ట్‌పై దాడి


**విచక్షణారహితంగా కొట్టిన అక్రమ మైనింగ్ నిర్వాహకులు**
**రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన జర్నలిస్టులు**

**విశ్వంభర, కాగజ్ నగర్ :** కాగజ్ నగర్ కు చెందిన ఓ విలేఖరి పై సోమవారం అక్రమ మైనింగ్ నిర్వాహకులు దాడి చేశారు. కాగజ్ నగర్ మండలం చారిగాం రహదారిలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. జెసిబి తో మట్టి తవ్వి ట్రాక్టర్ లో నింపుతుండగా జర్నలిస్ట్ ఫోటోలు తీసేందుకు అక్కడికి వెళ్ళాడు. అక్కడ ఉన్నవారు జర్నలిస్ట్ విచక్షణారహితంగా బూతులు తిడుతూ దాడి చేశారు. దీనిపై కాగజ్ నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. కాగజ్ నగర్ జర్నలిస్టులు ఆయనకు సంఘీభావం తెలిపి జర్నలిస్ట్ పై దాడి జరిపిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జర్నలిస్ట్ యూనియన్ ల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## కాళేశ్వరం సందర్శించిన ఢిల్లీ కేంద్ర బృందం



**విశ్వంభర, మహాదేవపూర్:** కేంద్ర ప్రభుత్వ ట్రైనీ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ల బృందం కాళేశ్వరం గ్రామపంచాయతీతో పాటు అంతర్ రాష్ట్ర వంతెనను సందర్శించింది. సోమవారం రోజు కేంద్ర ప్రభుత్వానికి చెందిన ట్రైనీ ఏ ఎస్ ఓ, అంకిత్ గుప్తా, సాహిల్, రిత్విక్, అనూస్ జాయిన్, అజిత్ సోనీల ఐదుగురు సభ్యుల బృందం, కాళేశ్వరానికి చేరుకొని గ్రామంలోని ఎస్సీ కాలనీ వాసులతో, పలు అంశాలపై అభిప్రాయాలను తీసుకున్నారు.అనంతరం అంతరాష్ట్ర వంతెన వద్దకు చేరుకొని వాహనాల రాకపోకలు మహారాష్ట్ర సరిహద్దు వివరాలు తెలుసుకోవడం జరిగింది. వారి వెంట మండల అధికారులు ఉన్నారు.





## ఇకపై ఉబర్ బస్సు సేవలు

**విశ్వంభర, న్యూ ఢిల్లీ:** ఫేమస్ క్యాబ్ సేవల సంస్థ ఉబర్ త్వరలో బస్సు సేవలను ఢిల్లీలో తొలుత ప్రారంభించనుంది. ఢిల్లీ ప్రీమియం బస్ స్కీమ్ కింద ఇకపై బస్సులను నడుపుటకు డిల్లీ రవాణా మంత్రిత్వ శాఖ నుంచి తాజాగా లైసెన్స్ అందుకుంది. ఈ తరహా లైసెన్స్ జారీ చేసిన తొలి రవాణా శాఖ డిల్లీనే. దీన్ని అందుకున్న తొలి అగ్రిగేటర్‌గా ఉబర్ నిలిచింది. ఏడాదిగా ఢిల్లీ - ఎన్‌సీఆర్‌తో పాటు, కోల్‌కతాలోనూ ప్రయోగాత్మకంగా ఈ సేవలు నడుపుతున్నామని ఉబర్ షటిల్ ఇండియా హెడ్ వెల్లడించారు. ఢిల్లీలో బస్సులకు విపరీతమైన డిమాండ్ ఉన్న నేపథ్యంలో అధికారికంగా తమ సేవలను దిల్లీలో ప్రారంభించబోతున్నామని వెల్లడించారు. బస్సు సర్వీసులకు వారం ముందు నుంచే ప్రయాణికులు బుక్ చేసుకోవచ్చని ,బస్సు రాబోయే సమయం, బస్సు లైవ్ లొకేషన్, బస్సు రూట్లను ఎప్పటికప్పుడు ఉబర్ యాప్‌లో తెలుసుకోవచ్చని తెలిపింది. ఒక్కో సర్వీసులో 19-50మంది ప్రయాణించడడానికి వీలుంటుందని ,ఉబర్ టెక్నాలజీ సాయంతో స్థానిక ఆపరేటర్లు వీటిని నడుపుతారని పేర్కొంది.

## బాధితులకు సత్వర న్యాయం అందాలి

**జిల్లా ఎస్పీ హర్షవర్ధన్**



**విశ్వంభర, మహబూబ్ నగర్ :** పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిం చాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల దినం సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 9 మంది బాధితు ల సమస్యలు వినతి పత్రాలను ఆయన పరిశీలిం చి,ఆయా సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ లో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. సామాన్య ప్రజలకు పోలీసులు అండగా నిలవాలని, సమస్యలు పరిశీలించి,వారితో స్నేహభావండగా మసులుకోవాలని, సంఘ వ్యతిరేక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు.

## మలేసియా కరాటే పోటీల్లో సత్తా చాటిన చిన్నారులు



**విశ్వంభర, ఎల్బీనగర్ మే 20 :** కరాటే పోటీల్లో నగరానికి చెందిన చిన్నారులు సత్తా చాటారు. ఇటీవల మలేషియాలో జరిగిన గోజురియో హైపోసిటీ ఓపెన్ కరాటే పోటీల ఛాంపియన్ షిప్ పోటీల్లో సరూర్ నగర్ మండలం విజయపురి కాలనీ, డాక్టర్స్ కాలనీలకు చెందిన ఎన్. జైకార్తికేయన్, ఎస్.తమన్, ఏ.ఎస్.ఎన్.గౌతం లు కట్టాస్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభను కనపరిచారు. వీరు రజిత పతకాన్ని సాధించి, దేశానికి గుర్తింపు తీసుకొచ్చారు. అదే విధంగా సీనియర్ కటాస్ విభాగంలో వైఆర్ శివకుమార్ స్వర్ణ పతకాన్ని సాదించారు. ఫైటింగ్ విభాగంలో ఎన్ జైకార్తికేయన్ రజిత పతకం, ఏ. ఎస్. ఎన్.తమన్, గౌతంలు కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. చిన్నారులను 'జపాన్ షోటోఖాన్ అసోసియేషన్ సీకో కరాటే డూ' కోచ్ వైఆర్ శివకుమార్ అభినందించారు.

## హనుమాన్ జయంతి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్



**విశ్వంభర, జగిత్యాల టౌన్:** మే 30,31 జూన్ 1 తేదీల్లో మూడు రోజుల పాటు కొండగట్టు హనుమాన్ జయంతి ఉత్సవాలు జరుగుతాయని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జయంతి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్ ను కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ దివాకర, కలెక్టరేట్ ఏ. ఓ. హన్మంతరావు, కొండగట్టు ఆలయ ఈ.ఓ. చంద్ర శేఖర్, డిప్యూటీ ఈ.ఓ అంజయ్య తో కలిసి ఆవిష్కరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా పేర్కొన్నారు.

# భక్తుల కల్పతరువు నృసింహుడు

## అన్ని అవతారాలకు భిన్నం నృసింహావతారం
## నేడు వైశాఖ శుక్ల చతుర్దశి నృసింహ జయంతి

"ఉగ్రం వీరం మహావిష్ణుం జ్వలంతం
సర్వతో ముఖం, నృసింహం భీషణం భద్రం
మృత్యుమృత్యుం నమామ్యహం"

రామకృష్ణాది అవతారములవలె గాక, నిర్యాణములేని శాశ్వత అవతారమైన శ్రీ నరసింహుని జయంతి అత్యంత ఆధ్యాత్మిక ప్రాధాన్యత నొందింది. వైశాఖ శుద్ధ చతుర్దశి పుణ్య తిథియందు ఉద్భవించిన నృసింహుని సేవతో, ఆకాల మృత్యు భయముండదని, దుష్టగ్రహ బాధలు, పైశాచిక చేతబడుల ప్రయోగాలను తిప్పికొట్టే శక్తి నృసింహ మంత్రానికి గలదని భక్తుల ప్రగాఢ విశ్వాసం. పగలు రాత్రి కాని సంధ్యా సమయాన, నరుడు జంతువు కాని రూపంతో, భూమ్యాకాశాలు కాని తొడలపై, సజీవము నిర్జీవ మూకాని చేతిగోళ్ళతో, హిరణ్యకశిపుని వధించి భక్త జన రక్షకుడై, సుదర్శన, శంఖ, చక్ర, ఖడ్గ, అంకుశ, పాశు, పరశు, ముసల, కులిశ, పద్మాదులను కలిగి గదాధరుడై ప్రకాశించిన ఉగ్రనారసింహ అవతార తత్వం మిగతా అవతారాలకు భిన్నం.

స్మృతి దర్పణం, గదాధర పద్ధతి, పురుషార్ధ చింతామణి, చతుర్వర్గ చింతామణి అన్నీ వైశాఖ శుక్ల చతుర్దశి నృసింహ జయంతిగా పేర్కొంటున్నాయి. "వృషభే స్వాతి నక్షత్రే చతుర్దశ్యాం శుభ దినే, సంధ్యాకాలే నిశాయుక్తే స్తంభోద్భూతం నృకే సరి:"బీ వైశాఖ శుక్లపక్ష చతుర్దశి స్వాతి నక్షత్ర ప్రదోష కాలంలో నృసింహుడు అవతరించాడు. ఒకసారి సనక సనందాది మహా మునులు వికుంఠుని దర్శనార్థం వెళ్ళగా, అది తగిన సమయం కాదని, జయ విజయులు అడ్డగించగా, మునులు కోపించి వారిని విష్ణు లోకానికి దూరం కాగలరని శపించారు. అప్పుడు వారు విష్ణువు శరణు వేడగా, మునుల శాపానికి తిరుగు లేదని చెప్పారు. కాని వారిలోని భక్తిని తెలిసిన మహావిష్ణువు వారికి ఒక ఉపాయాన్ని చెప్పారు. భక్తులుగా 7జన్మలు, లేదా విరోధులుగా 3జన్మలు భూలోకాన ఉంటే మునులు ఇచ్చిన శాపాన్ని అనుభవించినట్లు అవుతుంది. అటు ముని జనానికి వచ్చిన కోపం ఉపశమిస్తుంది. ఇటు మీరు కోరుకున్నట్టు తిరిగినా దగ్గరకు వచ్చే మార్గం మీకు సులువు అవుతుందని చెప్పాడు. జయ విజయులు ఏడు జన్మలు తమను విడిచి దూరంగా ఉండలేమని వైరంతో 3 జన్మలే మాకు అంగీకారమని చెప్పారు. వారే కృతయుగంలో హిరణ్యాక్ష హిరణ్య కశిపులుగా, త్రేతాయుగంలో రావణ కుంభకర్ణులుగా, ద్వాపరలో శిశుపాల దంతవ క్త్రులుగా జన్మించారు. రాక్షసరాజు హిరణ్య కశిపుడు తపస్సుకై వెళ్ళగా, ఆయన భార్య లీలాదేవి గర్భవతి, ఇంద్రు డు రాక్షస సంహారాన్ని ప్రారంభించి, చివరకు లీలావతిని అపహరించు కొని పోబోతుండగా, నార దు డు మందలించి, తన ఆశ్రమానికి తీసుకెళ్ళి, భా గవత తత్వబోధ చేయగా, గర్భస్థుడైన ప్రహ్లాదుడు విన్నాడు.



తపస్సుచే బ్రహ్మను మెప్పిం చిన హిరణ్య కశిపుడు తనకు నరులచే, మృగాలు, పగలు, రాత్రి, ప్రాణము న్న, ప్రాణము లేని, ఆయు ధము చేత, గాలిలో, నీటిలో, అగ్ని, ఆకాశంలో, భువిపైన గాని, దేవదా నవులచే, ఇంటగాని, బయ ట గాని మరణము లేకుండా వరము పొందాడు. పుట్టిన బిడ్డకు "ప్రహ్లాదుడు" అని నామకర ణం చేశాడు. హిరణ్య కశిపుడు వరగర్వ మదాంధుడై, విష్ణుద్వేషియై, దేవతలను జయించి, ఇంద్ర సింహాస నం ఆక్రమించి, తాపసుల ను వారి తపస్సులను భం గ పరిచాడు. సాధువులను హింసించి, పంచభూతాలను శాసించాడు.
విష్ణుభక్తుడైన కుమారుని మార్చడానికి హిరణ్యకశిపుడు శతవిధాలా ప్రయత్నించాడు. రాక్షస కుల గురువైన చండామార్కులకు కుమారుని అప్పగిం చాడు. హిరణ్య కశిపుడు, గురు కులంలో నీవు ఏమి నేర్చుకున్నావని ప్రశ్నిస్తే... ప్రహ్లాదుడు, "సర్వమూ అతని దివ్యకళామయము అని తలంచి, విష్ణువు నందు హృదయము లగ్నము చేయుట మేలు" అని బదులిచ్చాడు. రాక్షసు లకు తగని ఇలాంటి బుద్ధి నీకెలా పుట్టిందంటే "మాం దార మకరంద మాధుర్యమున దేలు, మధుపంబు వోవునే మదనములకు" అంటూ వైష్ణవ భక్తి సహజం గానే సంభవించిందన్నాడు. మళ్ళీ గురుకులానికి పంపబడి, మనసు మారిందేమోనని గురువు లేమి చెప్పిరని ప్రశ్నిస్తే, "చదివించిరి నను గురువులు... చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ" అని వివరించాడు. నవవిధ భక్తి మార్గములు హరిని నమ్మి యుండుట భద్రమన్నాడు. తుదకు విసిగిపోయి విష్ణువు ఎక్కడ ఉన్నాడురా అని ప్రశ్నించాడు. "కలడంబోధి కలండు గాలి గలడాకాశంబునన్ గుంభినిన్... వెదుకంగా నేల యీ యా యెడన్", "ఇందు గలడందు లేడని, సందేహము వలదు చక్రి సర్వోపగతుం డెందెందు వెదకి చూచిన, అందందే కలడు దానవాగ్రణి వింటే" అంటూ ప్రహ్లాదుడు బదులిచ్చాడు. అయితే "స్తంభమునను చూపగలవె చక్రిన్ అన్ని ప్రశ్నించగా, "కానబడు ప్రత్యక్ష స్వరూపంబునన్" అన్నాడా పరమ భాగవతోత్తము డైన ప్రహ్లాదుడు. వెంటనే హిరణ్య కశిపుడు స్థంభాన్ని చరవగా, శ్రీనృసింహుడు ఆవిర్భవించి, హిరణ్యకశిపుని ఒడిసి పట్టి, వజ్రాల వంటి, ప్రాణం ఉన్నవీ లేనివీ అయిన తన గోళ్ళుదో చీల్చి, మనిషి జంతువు కాని నరసింహ రూపంలో, పగలూ రాత్రిగాని సంధ్యా సమయాన, ఇంటా బయటా గాని గుమ్మంలో, భూమ్యాకాశాలు కాని తన తొడపై సంహరించాడు. ప్రహ్లాదుని మాటను యధార్థం చేసి, బ్రహ్మవరాన్ని గౌరవించి, తన అవతార తత్వాన్ని చాటాడు మహా విష్ణువు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో కదిరి, అహోబిలం, యాదగిరి గుట్ట, సింహాచలం, మంగళగిరి, ధర్మపురి, జగ్గయ్య పేట, పాలెం, సింగరాయ కొండ, పెంచల కోన, చీర్యాల తదితరాలే గాక కర్నాటకలో మేల్కొటె, ఉడుపి, సావన దుర్గ, దేవరాయన దుర్గ తదితర నృసింహాలయాలు ప్రఖ్యాతాలు. భక్తుల కోరికలు నెరవేర్చే కల్పతరువులు.

– రామ కిష్టయ్య, సంగన భట్ల...
9440595494

# జిల్లాల ఏకీకరణ సత్ఫలితాలనీయవు



ముఖ్యమంత్రి జిల్లాల ఏకీకరణ చేస్తామని ఇటీవల ప్రకటించారు. అది చిక్కులతో కూడుకున్నది. దీనిపై ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. జిల్లాలను తగ్గిస్తే ప్రజలు ఆందోళనతో ఉద్యమాలు చేస్తారు. సిరిసిల్ల వంటి జిల్లాల ఏర్పాటుకు చాలా ఉద్యమాలు చేసి సాధించుకున్నారు. గత ప్రభుత్వంలో హయాంలో 27అనుకున్న జిల్లాలు ఉద్యమాల వల్ల 33 చేయాల్సి వచ్చింది. ఒకటి రెండు మంత్రుల అభీష్టం, ఒత్తిడితో ఏర్పాటు చేసిన జిల్లాల్లో కొన్ని మండలా లను అస్తవ్యస్తంగా కలిపింది నిజమే. కాని ఇప్పుడన్నీ సర్దుకున్నాయి. చిన్న జిల్లాలు అలాగే వుంటే నష్టమేమిటి? ఆయా జిల్లాల్లో కలెక్టరేట్ సముదాయాలు ఏర్పాటు చేసి, ఉన్న ఉద్యోగులనే సర్దేశారు. కొత్త జిల్లాలతో పరిపాలన కేంద్రం ప్రజలకు చేరువైంది. గతంలో జిల్లా కొసకు పోవడం కన్నా పక్క జిల్లాకు పోవడం సులభంగా ఉండేది. సంస్కృతి, భాష, విద్య , నైపుణ్యాల పరంగా, నైసర్గిక పరంగా కూడా ఎన్నో వ్యత్యాసాలు. చిన్న జిల్లాల ఏర్పాటు వల్ల వెనకబడిన ప్రాంత ప్రజలు లబ్ధి పొందుతున్నారు. అతి ముఖ్యమైన అభివృద్ధి వికేంద్రీకరణకు కొత్త జిల్లాల ఏర్పాటు చక్కని మార్గం. జిల్లా కొక మెడికల్ కాలేజ్, పారిశ్రామికవాడ ఏర్పాటు అభివృద్ధికి తోడ్పడుతాయి. కేంద్ర ప్రభుత్వం నవోదయ విద్యాలయాలు మొదలైనవి జిల్లా కొకటి ఇస్తుంది. దీంతో చిన్న జిల్లాలు వేగంగా అభివృద్ధి చెందుతాయి. ఒక్క మాటలో చెప్పాలంటే 1986లో మండలాల ఏర్పాటు వల్ల మండల కేంద్రాలు, చుట్టు పక్కల గ్రామాలు ఎలా అభివృద్ధి చెందాయో.. చిన్న జిల్లాల ఏర్పాటుతో మరింత అభివృద్ధి చేకూరింది. జిల్లాలను కలిపివేస్తే ఈ క్రమం కుంటు పడుతుంది. కనక ప్రజలు ప్రతి పక్షాలు కొత్త జిల్లాలు కొనసాగాలని ఆందోళన చేయడం ఉద్యమించడం సహజం.

తక్షణం పరిష్కరించాల్సిన సమస్యలు కుల గణన, స్థానిక సంస్థల ఎన్నికలు జరపాల్సి వుంది. రెండు మూడు నెలల్లో డీఎస్సీ ద్వారా ఇతరత్రా రెండు లక్షల ఉద్యోగాలు నింపి యువతరం హృదయాలు గెలుకోవాల్సివుంది. కాళేశ్వరం సమస్యలను పరిష్కరించి వానా కాలం నీరు నిలుపుకొని వ్యవసాయానికి చేయూత నివ్వాలి. రూ.35 వేల కోట్ల అప్పుల చెల్లింపులకు 9 శాతం వడ్డీని 2 శాతానికి మార్చుకోవడానికి అంతర్జాతీయ బ్యాంకులతో ఒప్పందాలు కుదుర్చుకోవాల్సి ఉంది. గల్ఫ్, వలస కార్మికులకు నిర్దిష్ట ప్రణాళికలతో రోడ్ మ్యాప్ వేయాలి. పాఠ్య పుస్తకాలను మార్చాలి. అందులో అందెశ్రీ జాతీయ గీతం చేర్చాల్సి ఉంది. తెలంగాణ సాహిత్యాన్ని భాషను , గ్రంథాలయాలను అభివృద్ధి పరిచి శభాష్ అని అనిపించుకోవాల్సిన తరుణంలో జిల్లాల ఏకీకరణ చర్చ అవసరమా?


– బిఎస్ రాములు,
8331966987

# జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినోత్సవం

## నేడు రాజీవ్ గాంధీ వర్ధంతి

**జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినోత్సవం మే 21న దేశవ్యాప్తంగా ప్రతి ఏటా నిర్వహిస్తారు. 1991, మే 21న తమిళనాడులోని పెరంబుదూర్ ఎన్నికల ప్రచారంలో ఎల్‌టీటీఈ తీవ్రవాదులు జరిపిన అమానుష దాడిలో రాజీవ్ గాంధీ బలయ్యారు. నాటి నుంచి మే 21 తీవ్రవాద వ్యతిరేక దినోత్సవంగా ప్రకటించ బడింది. తీవ్రవాద చర్యలు రూపుమాపి, దేశ ప్రజలు సహజీవనంతో మెలగా లన్నది ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశం.**

40 ఏళ్ల వయసులో భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు రాజీవ్ గాంధీ. ఆయన 1944లో ఆగస్ట్ 20న ముంబైలో జన్మించారు. దేశ స్వాతంత్ర్యం నాటికి ఆయన తాత నెహురూప్రధానమంత్రి అయ్యే నాటికి రాజీవ్ వయసు 3 సంవత్సరాలు మాత్రమే. ఆయన తల్లిదండ్రులు ఇందిరా ఫిరోజ్ లక్నో నుంచి ఢిల్లీకి మకాం మార్చారు. 1984 అక్టోబర్ 31న తల్లి ఇందిరా గాంధీ దారుణ హత్యకు గురైన సమయంలో ప్రధాన మంత్రిగాను, కాంగ్రెస్ అధ్యక్షుడిగానూ ఆయన బాధ్యతలు చేపట్టారు.



లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన తమిళనాడులో పర్యటిస్తూ.. ఓ బహిరంగ సభ నిర్వహించారు. దీనికి భారీగా వచ్చిన జనాన్ని నివారించే చర్యలు చేపట్టి, కేంద్ర, రాష్ట్ర భద్రతా బలగాలు కొందరు వీఐపీ లను మాత్రమే కట్టుదిట్టమైన భద్రత ద్వారా ఆయన్ని కలవటానికి అనుమతించారు. అయినప్పటికి వేదిక పైకి అనుమతి పొందిన వారితో పాటుగా థాను, శివరాజన్, హరిబాబులు వెళ్లారు. థాను అనే ఒక యువతి ఒక గంధపు మాల తీసుకుని వెళ్లి రాజీవ్‌గాంధీ పాదాలను తాకేందుకు వంగి తన నడుముకు ఉన్న ఆర్డీఎక్స్ ను ప్రయోగించడంతో రాజీవ్ గాంధీ హతమార్చబడ్డారు. ఎల్‌టీటీఈకి చెందిన ఆత్మాహుతి దళం బాధ్యులు నళిని, ఆమె భర్త మురుగన్ రాజీవ్ గాంధీ హత్యకు కుట్ర పన్నారు. మే 21న రాత్రి 10 గంటల ప్రాంతంలో ఈ హత్య జరిగింది. ఆయన శరీరంలో ఒక భాగం, సగం తల కనిపించింది. పేలుడు జరిగిన సమయంలో రాజీవ్‌తో పాటు పలువురి శరీరాలు ముక్కలు ముక్కలుగా ఎగిరి పడ్డాయి. రాజీవ్ సెక్యూరిటీ అధికారి ప్రదీప్ గుప్తా ప్రాణాలు కోల్పోయాడు.
ఈ దుర్ఘటనలో సుమారు 14 మంది హతులయ్యారు. ఈ హత్యకు ప్రధాన సూత్రధారి తెన్మొజి రాజరత్నం. ఈమె థానుగా పిలువ బడింది. ఈ హత్యోదంతానికి శ్రీలంక లోని లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ ఈలం (ఎల్.టి.టి.ఈ) సంస్థ ప్రధాన కారకులు. ఈ హత్యలో ప్రధాన నిందితుడు శివరాజన్, ఆయన సహచరులు అరెస్ట్ కావడానికి ముందే సైనైడ్ తీసుకున్నారు.
ఈ కేసును సుప్రీం కోర్టు న్యాయ మూర్తులు కె.పిథమస్, డీపీ వాధ్వా, సయ్యద్ షా మొహమ్మద్ ఖ్వాద్రిల ఆధ్వర్యంలో నాలుగు మాసాలు చర్చ అనంతరం 1995 మే 5 న తుది తీర్పుగా కొందరు ముద్దాయిలకు ఉరి శిక్ష, మరి కొందరికి జీవిత ఖైదు విధించారు.

– రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

# అవధానంలో అసమాన ప్రతిభుడు రాళ్ళబండి

## నేడు రాళ్ళబండి కవితా ప్రసాద్ జయంతి




తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలు అందించిన ప్రసిద్ధ సాహితీవేత్త, అవధాన చక్రవర్తి రాళ్ళబండి కవితా ప్రసాద్. ఒకవైపు ఉద్యోగ రంగంలో సమర్ధ అధికారిగా పేరు తెచ్చుకుంటూనే, మరో వైపు కవితా క్షేత్రంలో అందెవేసిన చేయిగా, అవధాన ప్రక్రియలో అసమాన ప్రతిభుడిగా నిర్విరామ కృషీవలుడు రాళ్ళబండి. అవధానంలో పరిపూర్ణత్వం కోసం అంకిత భావంతో శ్రమించి సిద్ధి పొందిన తాపసి ఆయన. కవిత్వం పట్ల మోజుతో తనకు తల్లిదండ్రులు పెట్టిన వేంకటేశ్వర ప్రసాద్ పేరును కవితా ప్రసాద్‌గా మార్చుకున్న కవితాభిమాని.
సాంప్రదాయ అవధానానికి ఆధునిక పోకడలను నేర్పిన రాళ్ళబండి కృష్ణాజిల్లా గంపలగూడెం మండలం నెమలిలో 1961 మే 21న జన్మించారు. ఆయన నెమలిలో 10వ తరగతి వరకు చదివారు. తండ్రి కోటేశ్వరరాజు ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావడంతో తరచూ బదిలీ అయ్యేవారు. ఆ క్రమంలో సత్తుపల్లిలో కవితా ప్రసాద్ డిగ్రీ చదివారు. అవధాన విద్య ఆరంభ వికాసాలపై ఉస్మానియా విశ్వ విద్యాలయంలో పీహెచ్‌డీ చేసి గౌరవ డాక్టరేట్ పొందారు.
కవితాప్రసాద్ చిన్నప్పటి నుంచే సాంస్కృతిక రంగంపై ఆసక్తి. దాదాపు 500కి పైగా అవధాన సభలను ఆయన నిర్వహించారు. అష్టావధానం, శతావధానం, ద్విశతావధానం, నవరసావధానం తదితర విశిష్టమైన దశలను తెలుగు సాహితీ లోకానికి సమర్ధవంతంగా పరిచయం చేశారు. అమెరికాలోని తెలుగు భాషా, సాహితీ ప్రియులు ఆయన కోసం ప్రత్యేక వేదికలను ఏర్పాటు చేశారు. ఒంటరి పూలబుట్ట, పద్మ మంటపం, అగ్నిహింస, ఇది కవి సమయం తదితర సంపుటులను వెలువరించారు.
ఆధునిక నృత్య రూపక ప్రక్రియలో పంచకన్య, పంచకావ్యాలను రచించారు. ఈ రూపకాలను 24 గంటల్లోనే సిద్ధం చేసి ప్రముఖ నృత్య కారిణి మంజు భార్గవితో ప్రదర్శింప జేయడం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఒక సందర్భంలో 25 నిమిషాలలో విచిత్ర అష్టావధానం చేసి అసమాన ప్రతిభతో పండితుల మెప్పు పొందారు. వరంగల్ లోని భద్రకాళి ఆలయంలో ఏకదిన శతకరచన ధార అనే కార్యక్రమాన్ని చేపట్టి ఆశువుగా శతకాన్ని చెప్పారు. ఆశుకవితా ఝరి పేరుతో గంటకు 500 పద్యాలు చెప్పి ఔరా అనిపించు కున్నారు. సమైఖ్య ఆంధ్రలో గ్రూప్-1 అధికారిగా సాంఘిక సంక్షేమ శాఖలో వివిధ రకాల సేవలను అందించారు. ఆయన పర్యవేక్షణలో నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలు తిరుపతిలో జరిగాయి. తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ జాయింట్ డైరెక్టర్‌గా కూడా విద్దులు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శిగా ఉన్న కాలంలో 'సప్తగీతధామ', 'కవిసార్వభౌమ' పేరిట వేంకటేశ్వర సంకీర్తనలను రచించి సీడీ రూపంలో అందించారు. దాదాపు పాతికేళ్ల తరువాత ప్రతిష్టాత్మకంగా జరిగిన మహాసభలకు సమన్వయ కర్తగా వ్యవహరించారు. నాటి రాష్ట్ర మంత్రి కడియం శ్రీహరి వద్ద పీఎస్ గా బాధ్యతలు నిర్వర్తించారు. కవితా ప్రసాద్ 2015 మార్చి 15న హైదరాబాదులో హృద్రోగంతో తుదిశ్వాసవిడిచారు.

– రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# పర్యావరణ ప్రేమికుడు సుందర్‌లాల్ బహుగుణ

## నేడు సుందర్ లాల్ వర్ధంతి

ప్రఖ్యాత పర్యావరణ వేత్త, చిప్కో ఉద్యమకారుడు సుందర్‌లాల్ బహుగుణ 1927 జనవరి 9 న ఉత్తరాఖండ్‌లోని తెహ్రీ సమీపంలో మరోడా గ్రామంలో జన్మించారు. ఆయన గాంధేయవాది, ఉద్యమకారుడు, పర్యావరణవేత్త. ప్రధానంగా చిప్కో ఉద్యమానికి నాయకత్వం వహించారు. చెట్టు, పర్యావరణం, మానవ సమాజం అంటూ అందరికీ అర్థమయ్యే రీతిలో "చిప్కో ఉద్యమాన్ని" చేపట్టి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందారు.
చిప్కో ఉద్యమం అటవీ సంరక్షణ ఉద్యమం. 1973లో చమోలి జిల్లా (ఉత్తరాఖండ్)లోని గోపేశ్వర్‌లో 300 వృక్షాలను నరికేందుకు ఉత్తరప్రదేశ్ అటవీశాఖ (అప్పట్లో ఈ ప్రాంతం ఉత్తరప్రదేశ్లో భాగం) సైమన్ కంపెనీకి అనుమతిచ్చింది. దీనికి ఆ గ్రామస్తుల నుంచి తీవ్ర వ్యతిరేకిస్తూ.. ఒక్కొక్కరూ ఒక్కో చెట్టును ఆలింగనం చేసుకొని చెట్లను నరకాలనుకుంటే వాటితోపాటు మమ్మల్నీ నరకండని ఉద్యమం ప్రారంభమైంది. ఈ ఉద్యమాన్ని ఉత్తరాఖండ్ అడవుల్లో నివసించే గిరిజ, ముఖ్యంగా బిష్ణోయ్ తెగ మహిళలు చేపట్టారు. ఈ ఉద్యమాన్ని అడవి సత్యాగ్రహం అని కూడా అంటారు. బ్రిటిషర్లు రూపొందించిన అటవీ చట్టం -1927 వల్ల పల్లె ప్రజల హక్కులకు భంగం వాటిల్లడం, గ్రామీణులు జీవనోపాధి కోల్పోవడంతో ఈ ఉద్యమం దేశమంతా వ్యాపించింది.
బహుగుణ దేశ స్వాతంత్ర్యానికి ముందు వలస రాజ్యాల పాలనకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించారు. అతను తన జీవితంలో గాంధేయ సూత్రాలను అవలంభించారు. అతను వివాహానంతరం గ్రామీణుల మధ్య నివసించాలనీ విమ్లాను వివాహం చేసుకున్నారు.



జాతిపిత గాంధీ స్ఫూర్తితో, ఉద్యమంలో భాగంగా సుందర్‌లాల్ బహుగుణ 1981-83 మధ్యలో హిమాలయ పర్వత ప్రాంతాల్లో దాదాపు 500 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. నాటి ప్రధాని ఇందిరా గాంధీని కలిసి హిమాలయ ప్రాంతాల్లో చెట్ల నరికివేతను నిషేధించాలని కోరారు. ఫలితంగా అక్కడ 15 ఏళ్ల పాటు చెట్ల నరికివేతను నిషేధిస్తూ ప్రభుత్వం చట్టం చేసింది. దీంతో ఈ ఉద్యమం ఇతర రాష్ట్రాలకూ ఆదర్శంగా నిలిచింది.
ప్రారంభంలో ఆయన అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాడారు. తరువాత 1965 నుంచి 1970 వరకు తన మద్యపాన వ్యతిరేక ఉద్యమాన్ని గిరిజన మహిళలతో కలసి చేశారు. ప్రజలతో కలసి పెద్ద ఆనకట్టలకు వ్యతిరేకంగా పర్యావరణ సమస్యలపై ఉద్యమించారు. వృక్షాలే కాదు, అంతరించి పోతున్న జంతు, పక్షి జాతుల పరిరక్షణకు నిరంతరం పరితపించారు.
సుందర్ లాల్ 1970 లలో చిప్కో ఉద్యమంలో సభ్యుడిగా, తరువాత 1980 నుంచి 2004 ప్రారంభం వరకు టెహ్రీ ఆనకట్ట వ్యతిరేక ఉద్యమానికి నాయకత్వం వహించారు. టెహ్రీ ఆనకట్ట వ్యతిరేకంగా సత్యాగ్రహ పద్ధతులతో భగీరథి నది ఒడ్డున నిరాహార దీక్షలు చేశారు. ఆనకట్ట పర్యావరణ ప్రభావాలపై సమీక్ష కమిటీని నియమిస్తామని అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు ఇచ్చిన హామీ మేరకు 1995 లో అతను చేపట్టిన 45 రోజుల పాటు ఉపవాస కార్యక్రమాన్ని నిలిపి వేశారు. తరువాత ప్రధాని హెచ్ డీ దేవేగౌడ పదవీ కాలంలో రాజ్ ఘాట్ లోని గాంధీ సమాధి వద్ద 74 రోజులు ఉపవాస దీక్ష కొనసాగింది.
1987లో రట్ లైవ్‌లీ హుడ్ పురస్కారం (చిప్కో ఉద్యమం), 1986లో నిర్మాణాత్మక పనికి జమ్నాలాల్ బజాజ్ అవార్డు, 1989లో డాక్టర్ ఆఫ్ సోషల్ సైన్సెస్, గౌరవ డిగ్రీని ఐఐటి రూర్కీ ప్రదానం, 2009లో పర్యావరణ పరిరక్షణకు భారత ప్రభుత్వం పద్మ విభూషణ్ అవార్డు పొందారు. 1981లో భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు పొందాడు. అయితే ఆయన దానిని తిరస్కరించారు. 94ఏళ్ళ సుందర్‌లాల్ కోవిడ్19 తో రిషికేశ్‌లోని ఎయిమ్స్‌లో 2021 మే 21న శుక్రవారం తుదిశ్వాస విడిచారు.

– రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం

## మాజీ మంత్రి గుంటకండ్ల




**విశ్వంభర, హాలియా :** ఈనెల 27న జరగనున్న నల్గొండ, ఖమ్మం, వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాకేష్ రెడ్డి విజయం సాధించడం ఖాయమని మాజీ మంత్రి ,సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి తెలిపారు. సోమవారం హాలియాలో బూతు లెవెల్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గత ఐదు నెలలుగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని, ఉద్యోగ నోటిఫికేషన్ లలో గత ప్రభుత్వ నియామకాలను పూర్తి చేయకపోవడం దయనీయమైన పరిస్థితి అని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న గ్రాడ్యుయేట్ ఓటర్లను చైతన్య పరుస్తూ బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలవాలని ఆయన కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఈనెల 21 మంగళవారం జరిగే సన్నాహక సమావేశానికి బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు హాలియా పట్టణానికి రానున్నారని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, మేరెడ్డి, రాజీవ్ సాగర్ రాష్ట్ర నాయకులు కడారి అంజయ్య యాదవ్, ఎంపీపీ లు పేర్ల సుమతీ, పురుషోత్తం, చెన్ను అనురాధ, సుందర్ రెడ్డి, కె.వి.రామారావు, మండల పార్టీ అధ్యక్షులు కూరాకుల వెంకటేశ్వర్లు, పిడిగం నాగయ్య, పట్టణ అధ్యక్షుడు సతీష్ రెడ్డి, నల్గొండ సుధాకర్ వర్ర వెంకట్ రెడ్డి, పలువురు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు ఆయా మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

### వడ్ల కుప్పపై డీజిల్ పోసిన ఘటనపై ఆరా

**విశ్వంభర, జగిత్యాల :** ధాన్యం కొనుగోలు లో జాప్యం జరుగుతోందని నిరసనగా రైతు సందీప్ వడ్ల కుప్ప పై డీజిల్ పోసి అంటించే ప్రయత్నం చేయగా తోటి రైతులు ఆపిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ఉన్నత అధికారులతో ఫోన్లో మాట్లాడిన ఆయన వడ్ల కొనుగోలు వేగవంతం చేసి 23లోపు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.



# చేనేతల సమస్యలను పరిష్కరించాలి

**విశ్వంభర, చండూర్ మే 20 :** నల్గొండ జిల్లా చండూర్ మున్సిపాలిటీలో చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో కి వినతి పత్రం అందజేశారు. చేనేత సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన పరిష్క్రించి ఆదుకోవాలని కోరారు. చేనేత పరిరక్షణ సేవ సమితి అధ్యక్షుడు రాపోలు ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు, చేనేత కార్మిక సంఘాలు, పద్మశాలి కుల పెద్దల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత త్రిఫ్ట్ ఫండ్, చేనేత మిత్రతో పాటు ఇతర అన్ని పథకాలను కొనసాగించాలని, అదనంగా పథకాలను అమలు చేయాలని కోరారు. అలాగే పని భరోసా కలిపించాలన్నారు. త్రిఫ్ట్ ఫండ్ కు సంబంధించి అవసరమైతే కాలపరిమితి మేరకు ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించి తక్షణమే డబ్బులు విడుదల చేయాలని కోరారు. పని భరోసా కల్పించేందుకు ప్రింటెడ్ చీరలను అరికట్టడంతో పాటు చేనేత సంఘాలను బలోపేతం చేసి చేనేత చీరలను కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. 60 ఏళ్లు దాటిన వారికి కార్పొరేషన్ ద్వారా 5 లక్షల జీవిత బీమా తక్షణమే వచ్చేలా చూడాలన్నారు. బ్యాంకు రుణాలు మాఫీ చేయాలని, క్యాష్ లెస్ హెల్త్ కార్డులు ఇవ్వాలని, పిల్లల ఉన్నత చదువులకు ఆర్థిక సాయం అందించాలని పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు గుర్రం బిక్షమయ్య, గౌరవ అధ్యక్షుడు పులిపాటి ప్రసన్న, ట్రస్ట్ చైర్మన్ కోమటి వీరేశం, రావిరాల శ్రీను, చేనేత కార్మికులు కర్నాటి శ్రీనివాసులు, రాపోలు వెంకటేశం, ఎలె శ్రీను, సంగెపు శ్రీను, చెరుపల్లి కృష్ణ, రాపోలు జగదీశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



# అల్లర్లపై డీజీపీ చేతికి సిట్ నివేదిక

**విశ్వంభర, విజయవాడ :** ఏపీలో పోలింగ్ రోజు నుంచి జరిగిన హింసాత్మక ఘటనలపై సిట్ ఓ నివేదిక రెడీ చేసి డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాకు ఇచ్చారు. ఈ రిపోర్టును సీఎస్ జవహార్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి పంపింది. ఈ నివేదికలో సంచలన అంశాలు పొందుపరిచింది. అల్లర్లు, హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్న తిరుపతి, అనంతపురం, పల్నాడులో సిట్ బృంద పర్యటించింది. అల్లర్లకు సంబంధించిన చాలా వివరాలను తెలుసుకుంది. అల్లర్లు జరిగిన ప్రదేశాలతో పాటు.. కేసులు నమోదైన పోలీస్ స్టేషన్లకు కూడా వెళ్లింది. అల్లర్లకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లను విశ్లేషించింది. అల్లర్లు జరిగి ప్రదేశాల్లో స్థానికులతో మాట్లాడింది. స్థానికులు చెప్పిన విషయాలకు, ఎఫ్ఐఆర్‌లో నమోదైన వివరాలను పోల్చి చూసింది. అన్ని పరిశీలించి ఓ నివేదక తయారు చేసి డీజీపీకి అందించింది. ఈ అల్లర్లు వెనక మరికొంతమంది ప్రమేయం ఉందని సిట్ అధికారులు గుర్తించారు. దీంతో వారిపై కేసులు నమోదు చేయాలని సూచించింది. అంతేకాదు.. హింసాత్మక ఘటనలకు భద్రతా వైఫల్యం కూడా మరో ప్రధాన కారణమని గుర్తించింది. అల్లర్లుపై ముందస్తు సమాచారం ఉన్నా.. కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించింది. కొంతమంది అధికారులు ఏకంగా పలు పార్టీల నేతలతో కుమ్మకయ్యారని గుర్తించారు. అందుకే హింస జరుగుతున్నా చూసి చూడనట్టు వదిలేశారని సిట్ బృందం తెలిపింది. మొత్తం మూడు జిల్లాల్లోనూ 33 హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నట్లు గుర్తించింది. ఈ అల్లర్లుపై 150 పేజీల నివేదిక తయారు చేసి డీజీపీకి అందించింది. అంతేకాదు.. ఫలితాలు తర్వాత కూడా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించింది. రిజల్ట్స్ వచ్చిన తర్వాత కూడా ఉద్రిక్తత ఘటనలు చోటు చేసుకునే అవకాశం ఉందని హెచ్చరించింది.

# ఏసీబీ వలకు చిక్కిన కమలాపూర్ తహసీల్దార్



**విశ్వంభర, కమలాపూర్:** రైతు వద్ద లంచం తీసుకుంటూ అడ్డంగా ఏసీబీకి చిక్కిన తహసీల్దార్ సంఘటన హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. మండలంలోని కన్నూరు గ్రామానికి చెందిన కాసరబోయిన గోపాల్ తన తండ్రి రాజయ్య నుండి మూడెకరాల రెండు గుంటల వ్యవసాయ భూమిని తన పేరు మీదకి గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ కోసం వెళ్లగా తహసీల్దార్ మాధవి 6,000 రూపాయలు డిమాండ్ చేసి 5,000 రూపాయలు తనకి, వెయ్యి రూపాయలు ధరణి ఆపరేటర్ రాకేష్ కి ఇవ్వాలని డిమాండ్ చేశారన్నారు. ఈ క్రమంలో సోమవారం గోపాల్ 5,000 రూపాయలు తహసీల్దార్ కు ముట్ట చెప్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లు వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. గతంలోనూ తహసిల్దార్ పై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయని ఏసీబీ అధికారులు తెలిపారు. తహసీల్దార్ మాధవి ధరణి ఆపరేటర్ రాకేష్ పై కేసు నమోదు చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. తహసీల్దార్ ను ఏసీబీ అధికారులు పట్టుకోవడం పై బాధితులు హర్షం వ్యక్తం చేశారు.




# అమేథీ, రాయ్ బరేలీలో కాంగ్రెస్ గెలుస్తుంది

### మాజీ ఎంపీ హనుమంతరావు

**విశ్వంభర, గాంధీ భవన్ మే 20 :** మాజీ ఎంపీ వి. హనుమంతరావు గాంధీభవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహిచారు. వీహె మాట్లాడుతూ ఈ రోజు గాంధీభవన్‌లో రాజీవ్‌గాంధీ 33 వర్ధంతిని నిర్వహిస్తున్నామని, రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. అన్ని జిల్లాల్లో కాంగ్రెస్ శ్రేణులు రాజీవ్ గాంధీ 33 వర్ధంతిని ఘనంగా నిర్వహించి నివాళులు అర్పించాలనీ కోరారు. రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు పాద యాత్ర చేసి ప్రజల సమస్యలు తెలుసుకున్నాడని వీహెచ్ తెలిపారు. మోడీ కావాలని రాహుల్ గాంధీ పై లేనిపోని ఆరోపనలు చేస్తున్నారని అన్నారు. మోడీ హటావ్ దేశ్ కి బచావ్ అని దేశ ప్రజలు కోరుకుంటున్నారని వివరించారు. అమేథీ, రాయ్ బరేలీలో కాంగ్రెస్ ఖచ్చితంగా గెలుస్తుందని, ఈ సారి ఇండియా కూటమి గెలుస్తుందని కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పటు చేస్తుందని వి. హనుమంత రావు ఆశఆభావం వ్యక్తం చేశారు.



## అన్నదానం


**విశ్వంభర, ఎల్బీ నగర్ మే 20 :** ఎల్బీ నగర్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ జన్మదినం సందర్భంగా సాహెబ్ నగర్ దుర్గాస్థలి శ్రీ ఉమా రామ లింగేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ ముద్దగౌని సతీష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యం లో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీమతి ముద్దగౌని లక్ష్మి ప్రసన్న రామ్మోహన్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ లక్ష్మణ్ గౌడ్, కార్యదర్శి నాగరాజు, హరినాథ్ రావు, నరేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సిలిమర్తి శేఖర్, పారంద స్వామి, నాగమణి రెడ్డి, అరుణ, స్వప్న, వరలక్ష్మి,మాధవి తదితరులున్నారు.

# తిరుమల నడక మార్గంలో రెండు చిరుతల సంచారం



**విశ్వంభర, తిరుపతి :** తిరుమలలో మరోసారి చిరుత సంచారం కలకలం రేపింది. అయితే ఈసారి ఏకంగా రెండు చిరుతలు కనిపించి భక్తులను భయాందోళనకు గురిచేశాయి. అలిపిరి శ్రీవారి మెట్ల మార్గంలో భక్తులకు రెండు చిరుత పులులు ఎదురయ్యాయి. భక్తులకు సమీప దూరంలోనే చెట్ల పొదల్లో కనిపించాయి. దీంతో.. భయంతో భక్తులు అరుపులు, కేకలు వేశారు. వెంటనే రెండు చిరుతలు అడవిలోకి పారిపోయాయి. అయితే మళ్లీ వస్తాయేమోనని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమాచారాన్ని టీటీడీ అధికారులకు అందించారు. దీంతో.. భద్రతా సిబ్బంది అప్రమత్తమై ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చిరుతలను బంధించేందుకు చర్యలు ప్రారంభించారు. అయితే.. భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒంటరిగా మెట్లపై నడవొద్దని, గుంపులు వెళ్లాలని సూచించారు. భక్తులు తమతో వచ్చే వృద్ధులు, చిన్న పిల్లలను తమ వెంటేపెట్టుకోవాలని అన్నారు. భయపడాల్సిన అవసరం లేదని.. త్వరలోనే చిరుతలను పట్టుకుంటామని తెలిపారు. ఇప్పటికే బోనులు ఏర్పాటు చేశామని చెప్పారు. చిరుతలు చిక్కే వరకు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. టీటీడీ అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా.. భక్తులకు చిరుత పులుల బెడద తప్పడం లేదు. ఇప్పటికే చాలా సార్లు తిరుమలలో హల్ చల్ చేశాయి. గతంలో భక్తులపై దాడి చేసి గాయపడ్చిన ఘటనలు కూడా ఉన్నాయి. చిరుత దాడి చేసిన తర్వాత టీటీడీ భక్తులకు చేతికర్రలు కూడా అందిస్తోంది. అయినా.. తరచూ చిరుతల సంచారం భక్తులను కలవ పెడుతున్నాయి. ఐదు రోజుల క్రితమే తిరుమల ఘాట్ రోడ్డులో ఓ భక్తుడి కారుకు చిరుత అడ్డొచ్చింది. ఆ దృశ్యాలు సీసీ పుటేజీలో కనిపించాయి. అధికారులు తెలిపారు. తహసీల్దార్ మాధవి ధరణి ఆపరేటర్ రాకేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. తహసీల్దార్‌ను పట్టుకోవడంపై బాధితులు హర్షం వ్యక్తం చేశారు.

# హైదరాబాద్‌లో చుడీదార్ గ్యాంగ్ హల్‌చల్...!



**విశ్వంభర, హైదరాబాద్ మే 20 :** చెడ్డీ గ్యాంగ్ దొంగతనాల గురించి మనం తరచూ వినే ఉంటాం. వీరి గురించి ప్రత్యేకంగా చెప్పనక్క ర్లేదు. నిక్కర్లు, బనియన్లు మాత్రమే ధరించి చోరీలకు పాల్పడటం ఈ ముఠా ప్రత్యేకత. అయితే, తాజాగా హైదరాబాద్‌లోని శివారు ప్రాంతాల్లో ఇప్పుడు చెడ్డీ గ్యాంగ్ తరహాలోనే చుడీదార్ గ్యాంగులు దొంగతనాలకు పాల్ప డుతున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని ఎస్ఆర్‌నగర్, జెక్ కాలనీలో వెంకటేశ్వర రావు, ఆకృతి ఆర్కేడ్ అపార్ట్ మెంట్‌లో నివాసం ఉంటున్నారు. చుడీదార్ ధరించిన దొంగలు ఆయన ఇంట్లోకి చొరబడి రూ.1 లక్ష నగదు, ఒక ల్యాప్ ట్యాప్, నాలుగు తులాల బంగారం ఎత్తుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించిన దృశ్యాలు అపార్ట్‌మెంట్ సీసీ టీవీ కెమెరాల్లో రికార్డు అయినట్లు పోలీసులు వెల్లడించారు. కాగా దీనిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేత

**విశ్వంభర, ఘట్కేసర్ మే 20 :** ఘట్కేసర్ 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మత్తుల కారణంగా యన్నంపేట్ విలేజ్, తిరుమల వెంచర్, వసంత్ వాలి, శ్రీరామ్ ఎంక్లవే, ఇస్మాన్ ఖాన్ గూడా, విహారి హెూమ్స్, జయనగర్ ఏవెంట్స్ కాలనీ, శ్రీనివాస్ నగర్ కాలనీలో మంగళవారం ఉ 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మరియు శివారెడ్డి కూడా మారుతి నగర్, మైసమ్మ గుట్ట, బండారి అపార్ట్మెంట్, యాదగిరి రెసిడెన్సి, ఘనపూర్ గ్రామపంచాయతీ పరిధిలో మధ్యాహ్న 3 గంటల నుండి 5 గంటల వరకు పవర్ సప్లై నిలిపివేస్తున్నట్టు ఏఈ సతీష్ కుమార్ తెలిపారు.



## 23 నుండి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

**విశ్వంభర, ఘట్కేసర్ మే 20 :** ఘట్కేసర్ మండల్ వెంకటాపురం గ్రామంలో బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవ వేడుకలు మే 23 నుంచి 25 వరకు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలియజేశారు. ఈ మేరకు పూజారులు, దేవాలయ కమిటీ సభ్యులు బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. ప్రజలు, భక్తులు భారీ సంఖ్యలో హాజరు కావాలని ఆలయ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.



## మహంత్ స్వామి దేవాలయంను దర్శించుకున్న కార్పొరేటర్ నర్సింహా రెడ్డి

**విశ్వంభర, ఎల్బీ నగర్ మే 20 :** అబు మురీఖా, అబు దుబాయ్ లో ఉన్న ప్రవిత్రమైన మహంత్ స్వామి మహారాజ్ హిందూ దేవాలయంను బీజేపీ గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా బోచ సన్యాసి శ్రీ అక్షర్ పురుషోత్తం స్వామి నారాయణ సంస్థ (%దీూూూ%) మొదటి సాంప్రదాయ హిందూ రాతి ఆలయం నిర్మించడం జరిగింది. ఆ ఆలయమును కొన్ని రోజుల క్రితం మన భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారి చేతుల మీదుగా మొదటి హారతి నుంచి పూజలు అందించిన దేవాలయాన్ని నా కుటుంబ సమేతంగా దర్శించుకోవడం సంతోషకరంగా ఉందని అన్నారు.

# బీజాపూర్ జిల్లాలో 14 మంది నక్సల్స్ అరెస్ట్

**విశ్వంభర, బీజపూర్, మే 20 :** మొత్తం రూ.41 లక్షల రివార్డు కలిగి ఉన్న14మంది నక్సల్స్ ఛత్తీస్‌గడ్ లోని బీజపూర్ జిల్లాలో అరెస్ట్ అయ్యారని బీజపూర్ పోలీస్ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వీరిలో ఆరుగురు మహిళలు, ఎనిమిది మంది పురుషులు ఉన్నారని తెలిపారు. గంగలూరు పోలీస్ స్టేషన్ పరిధి లోని ముట్వెండి అటవీ ప్రాంతం, పిడియా గ్రామాల్లో ఆదివారం డిఆర్‌జి, జిల్లా పోలీస్‌ల సంయుక్త బృందం వీరిని పట్టుకోగలిగిందని చెప్పారు. 14మంది నక్సల్స్‌లో రేణు కొసవి, మంగ్లీ అవ్లంలకు ఒక్కొక్కరికి రూ.8లక్షల రివార్డు ఉంది. వీరిద్దరూ మిలిటరీ కంపెనీ నెంబరు 2 కు చెందిన వారు. గంగలూరు ఏరియా కమిటీ సభ్యులు బిచ్చెం యుయికా, షర్మిలా కుర్సం, లక్ష్మీతాటి ఒక్కొక్కరిపై రూ. 5 లక్షల రివార్డు ఉంది.మరో నలుగురు క్యాడర్లకు రూ. 2లక్షల వంతున, మిగతా ఇద్దరికి లక్ష వంతున రివార్డులు ఉన్నాయని పోలీస్‌లు ప్రకటనలో వివరించారు. వారి దాచి ఉంచిన నాలుగు టిఫిన్ బాంబులు, రెండు కుకర్ బాంబులు, డిటొనేటర్లు, కార్డెక్సు వైర్, జిలటిన్ స్టిక్స్, ఫైర్‌క్రాకర్లు, మావోయిస్టుల సంబంధిత మెటీరియల్ వారి నుంచి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈనెల 10న ఎన్‌కౌంటర్‌లో 12 మంది నక్సల్స్‌ను హతమార్చడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారి వివరాలు పోలీస్‌లు ఇంకా తెలియజేయలేదు. అయితే ఈ ఎన్‌కౌంటర్ బూటకమని గ్రామస్థులు, ఉద్యమకారులు విమర్శిస్తున్నారు. ఆరోపణలను పోలీస్‌లు కొట్టి పారేశారు. వీరి తలపై నగదు బహుమతులున్నాయని వివరించారు.

# బాటిళ్లలో పెట్రోల్ పోసిన బంకులపై చర్యలకు ఈసీ ఆదేశం



**విశ్వంభర, మైలవరం:** ఏపీలో పోలింగ్ తర్వాత జరుగుతున్న అల్లర్లతో ఈసీ అప్రమత్తం అయింది. హింసకు ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా కఠినంగా వ్యవహరిస్తోంది. లూజ్ పెట్రోల్ అమ్ముతున్న బంకుపై చర్యలు ప్రారంభించింది. మైలవరం లోని నూజివీడు రోడ్డులో పెట్రలో బంక్‌పై చర్యలు తీసుకోవాలని ఈసీ పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. ఆ బంకులో పెట్రోల్ బాటిళ్లలో వేస్తున్నట్టు అధికా రులు గుర్తించారు. అందుకే చర్యలు ప్రారంభిం చారు. బంకు యజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తదుపరి చర్యల కోసం పోలీ సులు పలు డిపార్ట్‌మెంట్‌లకు రిఫర్ చేశారు. ఏపీలో ఇటీవల జరిగిన అల్లర్లలో పెట్రోల్ బాంబులు తయారు చేసినట్టు గుర్తించారు. బాటిళ్లు, టిన్నుల్లో పెట్రోల్ తీసుకొని వెళ్లి.. కళ్లాల్లో పెట్రో బాంబుల తయారు చేశారని తేల్చారు. దీంతో.. లూజ్‌గా పెట్రోల్ అమ్మవద్దని బంకులకు ఆదేశించింది. వాహనదారులు, వినియోగ దారులకు ఎట్టి పరిస్థితుల్లో బాటిల్స్, క్యాన్, టిన్నుల్లో పెట్రోల్, డీజిల్ పోయవద్దని స్పష్టం చేసింది. వాహనాల్లో మాత్రమే డీజిల్, పెట్రోలు పోయాలని ఈసీ ఆదేశించింది. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి పెట్రోలు, డీజిల్ లూజుగా విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చిం ది. పెట్రోల్ బంక్ లైసెన్సు రద్దుకు సిఫార్సు చేయడానికి కూడా వెనకాడమని తేల్చి చెప్పింది. దీంతో పాటు అన్ని పెట్రోల్ బంకుల్లో సీసీ కెమెరాలు పనిచేయాలని ఆదేశాలు కూడా జారీ చేసింది. కానీ.. ఈసీ ఆదేశాలను భేఖాతరు చేసి చాలా మంది బాటిళ్లలో పెట్రోల్ పోస్తున్నారు. దీంతో.. అధికారులు చర్యలకు పూనుకున్నారు. ఈసీ ఆదేశాలకు విరుద్ధంగా పెట్రోల్ కొట్టిన బంకులపై కేసులు నమోదు చేస్తున్నారు.



## సేవ భావాన్ని కలిగి ఉండాలి : ఆర్.కృష్ణయ్య

**విశ్వంభర, రవీంద్రభారతి :** ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని కలిగి ఉండాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు. సోమవారం మంజునాథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మదర్ థేరిస్సా స్ఫూర్తితో గ్లోబల్ ఐకాన్ అవార్డులు 2024 రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి మంజునాథ సంస్థ అవార్డులు ఇచ్చి వారిని సత్కరించడం గొప్ప విశేషం అని ఇలాంటి కార్యక్రమాలకు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. అతిథుల చేతుల మీదగా వివిధ రంగాల్లో సేవలు అందించిన పలువురికి గ్లోబల్ ఐకాన్ అవార్డ్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, సినీ నటులు, పృథ్వీ, కిరణ్, సినీ నటి జగదీశ్వరి, మామిడి భీం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గుజరాత్‌లో నలుగురు ఐసిస్ ఉగ్రవాదులు పట్టివేత




**విశ్వంభర, అహ్మదాబాద్ మే 20 :** గుజరాత్‌లో నలుగురు ఐసిస్ ఉగ్రవాదులు పట్టుబడ్డారు. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అం తర్జాతీయ విమానాశ్రయంలో ఉగ్రవాదులను కేంద్ర నిఘా సంస్థ అరెస్ట్ చేసింది. ఆ నలుగురు ఉగ్రవాదులు శ్రీలంకకు చెందిన వారిగా గుర్తించారు. అయితే, ముందుగా విమానాశ్రయంలో ఉన్నారని గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్‌కు సమాచారం అందడంతో విమానాశ్రయానికి చేరుకుని ముమ్మరంగా తనిఖీలు నిర్వహించగా నలుగురు ఐసిస్ ఉగ్రవాదులను యాంటీ టెర్రరిజం స్క్వాడ్ గుర్తించి అదులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. కాగా, విచారణలో వారు శ్రీలంకకు చెందినవారిగా గుర్తించారు. అయితే, వారు చెన్నై నుంచి అహ్మదాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. పాకిస్థాన్ లోని తమ భాగస్వాముల నుంచి సమాచారం కోసం వారు ఎదురుచూస్తున్నట్లు విచారణలో తేలింది. వారి ఉద్దేశ్యాన్ని తెలుసుకోవడానికి యాంటీ టెర్రరిజం స్క్వాడ్ ప్రస్తుతం రహస్య ప్రదేశంలో దర్యాప్తు చేస్తోందని వెల్లడించారు.

## ఆప్‌కు రూ.7 కోట్ల విదేశీ నిధులు : ఈడీ



**విశ్వంభర, ఢిల్లీ మే 20 :** ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని పొడిగించాలని కోరుతూ రౌస్ అవెన్యూ కోర్టులో సోమవారం ఈడీ పిటిషన్ వేసింది. కేజ్రీవాల్ కస్టడీని 14 రోజులు పొడిగించాలని ఈడీ కోరింది. ప్రస్తుతం మధ్యంతర బెయిల్‌పై ఉన్న ఆయన జూన్ 2న కోర్టు ఎదుట లొంగిపోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్ కస్టడీని పొడిగించాలని కోరుతూ ఈడీ పిటిషన్ దాఖలు చేసింది. మద్యం పాలసీ కేసులో ఈడీ ఆయనను మార్చి 21న అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అదేవిధంగా ఆమ్ ఆద్మీ పార్టీ రూ.7 కోట్ల విదేశీ నగదు అందుకుందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేంద్ర హోం శాఖకు వెల్లడించింది. 2014 నుంచి 2022 మధ్య ఈ విదేశీ నిధులు అందుకున్నట్లు తెలిపింది. ఆమ్ ఆద్మీ పార్టీ ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ ను ఉల్లంఘించినట్లు ఈడీ పేర్కొంది. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్ దేశాల నుంచి ఆప్‌కు ముడుపులు అందాయని ఈడీ వెల్లడించింది. కాగా, కేంద్ర ఏజెన్సీ గతవారం మద్యం పాలసీ కేసులో అదనపు ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది. అరవింద్ కేజ్రీవాల్, ఆమ్ ఆద్మీ పార్టీని నిందితులుగా పేర్కొంది.

# మధురాపురంలో విషాదం

### దిమ్మె కూలి చిన్నారి మృతి

**విశ్వంభర, షాద్‌నగర్ :** దిమ్మె కూలి చిన్నారి మృతి చెందిన ఘటన షాద్ నగర్ నియోజకవర్గం ఫరూఖ్ నగర్ మండలం మధురాపురం గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. మధురాపురం గ్రామానికి చెందిన పినమోని మల్లేష్, రమాదేవి దంపతుల చిన్న కూతురు సాక్షి ప్రమాదవశాత్తు మృతి చెందింది. నాలుగున్నర సంవత్సరాల సాక్షి సరదాగా తోటి స్నేహితులతో ఆడుకుంటు ఇంటి ముందున్న ప్రహరీ గోడ గేటు దిమ్మెను పట్టుకోగా అది ఊడీ పాప తలపై పడడం తో తల పగిలి అక్కడికక్కడే మృతి చెందింది. అప్పటి వరకు అందరితో సరదాగా ఆడుతూ పాడుతూ ఉన్న సాక్షి ఒక్కసారిగా విగతజీవిగా మారడంతో పాపను చూసిన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం బీజేపీ సన్నాహక సమావేశం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) మే 20 :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలో సోమవారం బీజేపీ మండల పార్టీ కార్యాలయంలో గజరాజ్ కాశీనాథ్ ఆధ్వర్యంలో ఈ నెల 27 తారీకు జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ సన్నాహక సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకులు దాసరి మల్లేష్, రాష్ట్ర నాయకురాలు కరుణ హాజరై ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన విషయాలు, విధి విధానాలపైన చర్చించడం జరిగింది. ఈ సమావేశంలో కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొట్టు అబ్బయ్య, జిల్లా అధికార ప్రతినిధి బొబ్బలా ఇంద్రారెడ్డి, కిసాన్ మోర్చ జిల్లా కార్యదర్శి బండారు సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి తవిటి రాంరెడ్డి, ఎస్సీ మోర్చ మండల అధ్యక్షులు మేడి సాగర్, సీనియర్ నాయకులు యస్ వెంకట్ రెడ్డి, లోడి వెంకటయ్య, మచ్చ చారి, సూర్య, మహేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీని ఓడించటం కోసమే

# ఇండియా బ్లాక్ భాగస్వామ్యం

### సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మీ



**విశ్వంభర, సూర్యాపేట మే 20 :** నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మద్దతు ప్రకటిస్తున్నామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మీ అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో జరిగిన సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గం సమావేశంలో ఆమె మాట్లాడుతూ నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి జరగనున్న శాసనమండలి ఎన్నికల్లో కాంగ్రెస్ కు మద్దతివ్వాలని సీపీఐ(ఎం) రాష్ట్ర పార్టీ నిర్ణయించిందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో లౌకిక విలువలు, ప్రజాస్వామ్యం కోసం, ఇండియా బ్లాక్ భాగస్వామి అయిన కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నామన్నారు. అదేవిధంగా, ఇప్పుడు కూడా బీజేపీని ఓడించటం కోసం ఇండియా బ్లాక్ భాగస్వామి అయిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మద్దతు ప్రకటిస్తున్నదని, పట్టభద్రులైన ఓటర్లు కాంగ్రెస్ అభ్యర్థికి ఓటేసి గెలిపించాలనీ, మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఐ(ఎం) పిలుపు నిస్తుందని అన్నారు. సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మది వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, కోట గోపి తదితరులు పాల్గొన్నారు.

## లయన్ రమణారావును సన్మానించిన ప్రముఖులు




**విశ్వంభర, బషీర్ బాగ్ మే 20 :** తిరుపతి పట్టణంలోని మహతి కళాక్షేత్రంలో జైజవాన్ జై కిసాన్ జై కళాకార్ సంస్థ పదకవితా పితామహుడు అన్నమాచార్య 616 వ జయంతి వేడుకలలో భాగంగా అన్నమయ్య సంగీత నృత్యోత్సవం పేరిట నిర్వహించిన సంగీత నృత్య కార్యక్రమములో వివిధ రాష్ట్రాల నుండి తరలి వచ్చిన కళాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టిటిడి పాలక మండలి మాజీ సభ్యులు పోకల అశోక్ కుమార్ తిరుపతి పుణ్య క్షేత్రంలో జరిగిన అన్నమయ్య సంగీత నృత్యోత్సవంలో పాల్గొనడం గురువులకు కళాకారులకు పూర్వజన్మ సుకృతంగా భావించాలని కళాకారులకు అభినందనలు తెలిపారు. మరొక విశిష్ట అతిథి శ్రీ తాళ్లపాక అన్నమాచార్య 14 వ తరం వంశీకులు శ్రీ హరినారాయణాచార్యులు మాట్లాడుతూ సదా ఆ స్వామి వారి కైంకర్యములో పాల్గొనే అదృష్టాన్ని ప్రసాదించిన తాళ్ళపాక అన్నమాచార్యులకు ప్రణమిల్లుతూ ప్రతి క్షణం ఆ వేంకటేశ్వరస్వామి మధుర నామ స్మరణతో స్వామివారి అశీస్సులతో ప్రతిరోజూ ఎటువంటి ఆటంకం లేకుండా గడుస్తుందని, ప్రతి ఒక్కరూ అ స్వామి నామస్మరణతో జీవించాలని తెలిపారు. విజన్ వివికె హౌజింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వల్లూరి విజయ్ కుమార్, రాష్ట్ర రంగస్థల కళాకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి మునిరత్నం, టిటిడి మాజీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చిన్నంగారి రమణ, మబ్బు సూర్యనారాయణ రెడ్డి తదితర అతిథులు విచ్చేశారు. ఈ సందర్భంగా గురువులు సాలెం శ్రీవిద్య, యామిని, జక్కిడి ప్రసన్నారెడ్డి, మైథిలి దినకరన్, మంజాల పద్మజ, లక్ష్మి ప్రవీణా, సిందిరి ఆశా, సునీతా దేవి, జయలక్ష్మి శ్రీనివాస్, శ్రీమతి తంగిరాల కృష్ణప్రియ, మీనాక్షి శివకుమార్, కావూరి నాగజ్యోతి, కుమారి దుర్గా మంత్రవాడి పాల్గొని జర్నలిస్ట్ లయన్ కె.వి.రమణారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం అద్భుతంగా జరిపిన సందర్భంగా దేశ విదేశాలలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తూ మన కళాకారులను ప్రోత్సహిస్తూ కళలను విశ్వ వ్యాప్తం చేయడానికి కృషిచేస్తున్నందుకు గాను ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు, గురువులు తిరుపతి పట్టణ ప్రజల సమక్షంలో రమణారావును సన్మానించి సత్కరించారు.

## మూగజీవాలే లక్ష్యంగా

# దుగ్గొండిలో వరుస దొంగతనాలు..!

### స్విఫ్ట్ కారులో పారిపోయిన వైనం..

**విశ్వంభర, దుగ్గొండి:** వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలో దొంగలు హల్చల్ చేస్తున్నారు. మూగజీవాలే లక్ష్యంగా గ్రామాలలో ఇంటి పరిసర ప్రాంతాల్లో ఉన్న గొర్రెల మందలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారు. మండలంలోని గోపాలపురం గ్రామంలో ఎల్లబోయిన బుచ్చయ్య ఇంటి వద్ద ఉన్న గొర్రెల మందలో దొంగతనానికి గుర్తు తెలియని వ్యక్తులు యత్నించారు. తెల్లవారు జామునే స్నానం కోసం వెళుతున్న హనుమాన్ దీక్ష మాలాదారులు చూసి కేకలు వేయడంతో విఫలయత్నం చెంది దొంగలు తమ బ్లాక్ కలర్ స్విఫ్ట్ కారులో పారిపోయినట్లు విశ్వసనీయ సమాచారం. సోమవారం తెల్లవారు జామున దుగ్గొండి మండల కేంద్రంలో బత్తుల చందు, ఎల్లబోయిన రాజులు గొర్రెల మందలో 2 మేకలు 2 గొర్రెలు అపహరణకు గురయ్యాయి. ఇంతకు ముందు ఏప్రిల్ 21 న గోపాలపురం గ్రామంలో మాదం రవికి చెందిన 4 గొర్రెలు, ఏప్రిల్ 12 వ తేదీన దుగ్గొండిలో సోనా బోయిన కుమారస్వామి గొర్రెల మందలో 3 మేకలు 3 గొర్రెలు అపహరణకు గురయ్యాయి. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ కు కూతవేటు దూరంలో వరుస దొంగతనాలు జరుగుతుండటంతో దొంగలను గుర్తించడం పోలీసులకు సవాలుగా మారింది.





## అమెరికాలో తొలి తెలుగు జడ్జిగా జయ బాదిగ నియామకం

**విశ్వంభర, కాలిఫోర్నియా:** తెలుగు మహిళ జయ బాదిగకు అమెరికాలో అరుదైన గౌరవం దక్కింది. కాలిఫోర్నియాలోని శాక్రమెంట్ కౌంటీ సుపీరియర్ కోర్టు జడ్జిగా ఆమె నియమితులయ్యారు. దీంతో తెలుగు రాష్ట్రాల నుంచి కాలిఫోర్నియాలో జడ్జిగా బాధ్యతలు చేపట్టిన తొలి మహిళగా నిలిచారు. కాగా, 2022 నుంచి ఇదే కోర్టులో ఆమె కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఏపీలోని విజయవాడకు చెందిన జయ... హైదరాబాద్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. అనంతరం అమెరికా వెళ్లిన ఆమె బోస్టన్ యూనివర్సిటీలో ఎంఏ చేశారు. ఆ తర్వాత శాంటా క్లారా విశ్వవిద్యాలయం నుంచి లా పట్టా పొందారు. 2009లో కాలిఫోర్నియా స్టేట్ బార్ ఎగ్జామ్ క్లియర్ చేశారు. 10 ఏళ్లకు పైగా న్యాయవాద వృత్తిలో ప్రైవేట్ ప్రాక్టీస్‌లో కొనసాగుతున్నారు. ఈ క్రమంలో లాభాపేక్ష లేకుండా పలు కేసుల్లో ప్రభుత్వం తరఫున వాదించారు. అదేవిధంగా మెక్‌జార్జ్ స్కూల్ ఆఫ్ లాలో అధ్యాపకురాలిగానూ జయ బాదిగ పని చేశారు.

## 10 జీపీఏ సాధించిన విద్యార్థులను అభినందించిన కలెక్టర్ హరిచందన

**విశ్వంభర, నల్లగొండ మే 20 :** ప్రభుత్వ సాంఘిక సంక్షేమ, గిరిజన వసతి గృహాలలో ఉంటూ కష్టపడి చదివి పదవ తరగతి ఫలితాలలో 10 జీపీఏ సాధించిన విద్యార్థిని విద్యార్థులను నల్గొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన సోమవారం అభినందించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో విద్యార్థిని, విద్యార్థులకు ప్రశంసా పత్రం, జ్ఞాపికలను అందించారు. విద్యార్థులు చిన్నప్పటి నుండి కష్టపడి చదివి మంచి ప్రతిభ సాధించి భవిష్యత్తులో సమాజంలో ఉన్నత స్థానం పొందాలని, ఒక గొప్ప లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ లక్ష్యసాధనకు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ హాస్టల్లలో ఉంటూ కష్టపడి చదివి పదికి పది జీపీఏ సాధించడం సంతోషకరమని, వీరిని ఆదర్శంగా తీసుకుని ఇతర విద్యార్థులు సైతం బాగా చదివి మంచి మార్కులు పొందాలని కోరారు. కష్టపడి చదివిన వారికి భవిష్యత్తు బాగుంటుందని, చదువుతోనే మన జీవితంలో ఊహించని మార్పులు వస్తాయని, ప్రతి ఒక్కరూ ఇలాగే కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ కోరారు 10 జీపీఏ సాధించిన వారిలో గిరిజన సంక్షేమ హాస్టల్ లో చదివిన రమావత్ సర్దార్, పాల్య సహారా, వడ్త్యా అరవింద్, ఎస్సీ సంక్షేమ హాస్టల్లో చదివిన ఇరాపురి అక్షర, చలమల పుష్కరిణి, అయేషా అంజుమ్‌లు ఉన్నారు. కరోనా సమయంలో అకాల మరణం చెందిన మునుగోడు తహసిల్దార్ సునంద పేరు మీద తన భర్త లక్ష్మారెడ్డి 10 జీపీఏ సాధించిన ముగ్గురు ఎస్సీ సంక్షేమ విద్యార్థినీ విద్యార్థులకు ఒక్కొక్కరికి ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, హౌసింగ్ పీడీ రాజ్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



## 4 బంగారు పథకాలు సాధించిన రణవీర్ తైక్వాండో అకాడమీ విద్యార్థులు

**విశ్వంభర, స్పోర్ట్స్ మే 20 :** స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ గోవా ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఇంటర్నేషనల్ ఓపెన్ ఇన్విటేషనల్ మార్షల్ ఆర్ట్స్ 2024 ఛాంపియన్‌షిప్ గోవాలోని మల్టీపర్పస్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ నెల 19వ తేదీన గోవాలో యూనివర్శల్ 369 షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా సాయి కుమార్ ఆధ్వర్యంలో మాస్టర్స్ ఛాంపియన్స్ పోటీలను నిర్వ హించారు. ఈ పోటీలో తెలంగాణ రాష్ట్రం నుండి సైనిక్‌పురి స్పోర్ట్స్ సెంటర్ రణవీర్ తైక్వాండో అకాడమీ మాస్టర్ రమేష్ విద్యార్థులు పూమ్సే మరియు నంచకా లో వైష్ణవి, అరుణ్ తేజ్‌లు 4 బంగారు పతకాలు సాధించి తమ ప్రతిభను చాటారు. ఈ ఛాంపియన్ షిప్ లో 14 రాష్ట్రాల నుండి క్రీడాకారులు పాల్గొన్నారు. అదేవిధంగా బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, జింబాబ్వే, దుబాయ్ దేశాల నుండి క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ రమేష్ మట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు బంగారు పతకాలు సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో ఇలాంటి పతకాలు మారెన్నో సాధించాలని కోరుకున్నారు.

## రాహుల్ ప్రధాని కావడం ఖాయం..

### వీహెచ్ కీలక వ్యాఖ్యలు

**విశ్వంభర, హైదరాబాద్ మే 20 :** ఇండియా కూటమి గెలవడం ఖాయమని కాంగ్రెస్ సీనియర్ నేత వీ హనుమంత రావు అన్నారు. అంతేకాదు రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ, ఎన్డీఏ పని అయిపోయిందని ఆయన జోస్యం చెప్పారు. బీజేపీ బలహీన పడుతున్నా.. ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా 400 సీట్ల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. అయితే ప్రజలు బీజేపీని నమ్మే పరిస్థితి లేదని అన్నారు. కారణం లేకుండా రాహుల్ గాంధీని విమర్శించడం బీజేపీ నేతలకు అలవాటుగా మారిందని వీహెచ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అయితే, ప్రజలు ఈసారి బీజేపీకి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. రాహుల్ గాంధీకి దేశం విడిచి వెళ్లిపోవాల్సిన అవసరం లేదని వీహెచ్ చెప్పారు. ఇండియా కూటమి అధికారంలోకి వచ్చి రాహుల్ ప్రధాని అయితే.. బీజేపీ నేతలే దేశం దాటి పారిపోతారని అన్నారు. మోడీకి ఇండియా కూటమికి బయపడుతున్నారని.. అందుకే మతరాజకీయాలకు తెరలేపారని విమర్శించారు. పదేళ్లలో బీజేపీ ఏం చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. అంబానీ, అదానీకి తప్ప పేదలకు ఏం చేశారని వీహెచ్ నిలదీశారు. మణిపూర్ ఘటనపై ఇంతవరకూ మోడీ నోరు విప్పలేదని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ గాలి బుడగలాంటిదని అన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత బీజేపీ నేతలే వాస్తవాలను గ్రహిస్తారని చెప్పారు. చాలాచోట్ల బీజేపీ కి డిపాజిట్లు కూడా రావని వీహెచ్ జోస్యం చెప్పారు.


## పిఠాపురంలో హింసపై ఈసీకి ఇంటెలిజెన్స్ రిపోర్ట్!

**విశ్వంభర, పిఠాపురం :** ఏపీలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల పోలింగ్ గతవారం ముగిసింది. ఎన్నికల వరకు ప్రచారాలతో హోరెత్తించిన పార్టీలు ఇప్పుడు సైలెంట్ అయినా.. ఫలితాల గురించి ప్రజల్లో మాత్రం తీవ్రమైన ఉత్కంఠ నెలకొంది. ఎవరు గెలుస్తారని అంచనా వేయడం చాలా కష్టంగా ఉంది. పోలింగ్ జరిగిన తీరు చూసిన తర్వాత తలపండిన రాజకీయ విశ్లేషకులు ఓ అంచనాకు రాలేకపోతున్నారు. అన్ని పార్టీలు బయటకు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నా.. లోలోపల భయపడుతున్నట్టు తెలుస్తోంది. అయితే, ఇప్పుడు అందరి దృష్టి పవన్ కల్యాణ్ పైనే ఉంది. గత ఎన్నికల్లో రెండు చోట్ల పోటీ చేసి ఓడిపోయిన పవన్ ఈసారి ఒకే స్థానం నుంచి పోటీ చేసి పెద్ద సాహసమే చేశారు. తన పోటీ చేసిన పిఠాపురంపై పవన్ ఎంత ఫోకస్ చేశారో.. వైసీపీ కూడా అంతే దృష్టి పెట్టింది. చివరి వరకూ వైసీపీ బలంగా పోరాటం చేసింది. అన్ని రకాల అస్త్రాలు ప్రయోగించింది. పిఠాపురంలో ప్రచారం కోసం వైసీపీ పెద్ద ఎత్తున తన సైన్యాన్ని దించింది. కానీ, పవన్ తరఫున ప్రచారానికి కూడా సెలబ్రిటీలు, ఎన్నారైలు గట్టిగానే వచ్చారు. దీంతో పిఠాపురంలో ఫలితం ఎలా ఉంటుందా అన్న ఉత్కంఠ నెలకొంది. అటు పిఠాపురంపై ఈసీ కూడా స్పెషల్ ఫోకస్ చేసింది. అక్కడ అల్లర్లు జరిగే అవకాశం ఉందని ముందు నుంచి అనుమానం వ్యక్తం చేస్తోంది. ఈసీ అనుమానాలు బలపడేలా ఓ వార్త బయటకు వచ్చింది. పిఠాపురంతో పాటు కాకినాడ సిటీ నియోజకవర్గాల్లో కౌంటింగ్‌కు ముందు, ఆ తర్వాత హింసాత్మక ఘటనలు జరిగే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ గుర్తించింది. ఇంటెలిజెన్సీ అధికారులు ఈసీకి నివేదిక కూడా ఇచ్చారు. ఆ నియోజకవర్గాల్లోని ఏటిమొగ, దుమ్ములపేట, రామకృష్ణారావు పేట సహా పలు ప్రాంతాల పై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఎన్నికల సంఘం సూచించింది. గొడవలకు ప్రేరేపిస్తారనే అనుమానం ఉన్న వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించింది.



## స్విమర్స్‌కు ఉచిత వైద్య పరీక్షలు

**విశ్వంభర, నల్లగొండ మే 20 :** జిల్లా క్రీడా ప్రాధికారి సంస్థ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ పూల్ స్విమర్స్ కు సోమవారం డాక్టర్ జయకుమార్ చే ఉచిత వైద్య శిబిరం నిర్వహించి చర్మవ్యాధుల పరీక్షలు ఇతర ఎలర్జీలు రాకుండా తగు సూచనలు చేశారు. అలాగే ప్రతిరోజు స్విమ్మింగ్ కు వచ్చే బాల బాలికలు నిబంధనలు పాటించి ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి ఎండి మక్బూల్ అహ్మద్, సూపర్డెంట్ ఆర్ కిరణ్. కుమార్, స్విమ్మింగ్ పూల్ ఇంచార్జ్ ఎం డి నజీరుద్దీన్, స్విమ్మింగ్ పూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలు

**విశ్వంభరా, ఎల్బీనగర్ మే 20 :** రంగారెడ్డి జిల్లా టియుడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి సీనియర్ పాత్రికేయుడు తాటిపర్తి ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సరూర్ నగర్ కార్యాలయం వద్ద సోమవారం ప్రవీణ్ కుమార్ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు జర్నలిస్టులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కటకం సుభాష్, తగరం సత్యనారాయణ, శ్రీకాకోళ్ల రాజు గుప్తా, మల్కాజ్గిరి కుమార్, భవాని ప్రమోద్, బండి నరేందర్, అనిల్ కుమార్, టి. శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

# చేపమందు పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణలో మృగశిర కార్తె రోజున చేపలు తినడం అనా దిగా వస్తున్న ఆచారం. ఈ విధంగా మృగశిర కార్తె నాడు చేపలు తినడం వల్ల ఆస్తమా, గుండె జబ్బుల రోగులకు ఉపశమనం దొరుకుతుందని నమ్ముతారు. అలాగే., ప్రతి ఏడాది మృగశిర కార్తె రోజున హైదరాబాద్కు చెందిన బత్తిని కుటుంబం వారు చేప మందు 'ప్రసాదం' పంపిణీ చేస్తుండటం అనవాయితీగా వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా.. చేప మందు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రభుత్వం, పలు స్వచ్ఛంద సంస్థలు ప్రకటించాయి. ఈ మేరకు బత్తిని, గౌడ్స్ కుటుంబ సభ్యులు సోమవారం సోమాజీగూడ ప్రెస్ క్లబ్లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. బత్తిని అమర్నాథ్ గౌడ్ మాట్లాడుతూ.. దాదాపు 20 ఏళ్లుగా మా కుటుంబం ఆస్తమా, ఉబ్బసం, దమ్ము, దగ్గు వంటి శ్వాస సంబంధ వ్యాధుల నివారణకు మృగశిరా కార్తె నాడు పంపిణీ చేస్తున్నామని అన్నారు.వ్యాధి తీవ్రత




ను బట్టి రోగి నాల్గు నుండి ఐదు సంవత్సరాలు తీసుకుంటే పూర్తిగా నయం అవుతోందని అన్నారు. ఈ సేవ మా కుటుంబ పెద్దలకు 190 ఏళ్ల క్రితం ఓ మునీశ్వరుడు బోధించారని చెప్పారు. అప్పటినుండి నిస్వార్థంగా ఉచితంగా లక్షలాదిమంది శ్వాస సంబంధిత రోగులకు తరతరాలుగా ఇస్తున్నామన్నారు. ఇప్పటివరకూ ప్రభుత్వాలన్నీ తమకు పూర్తి సహకారాన్ని అందిస్తూ వస్తున్నాయని అన్నారు. జూన్ 8వ తేదీన ఉదయం 11 గంటల నుండి మరునాడు ఉదయం 11 గంటల వరకు నాంపల్లి ఎగ్జిబిషన్స్ గ్రౌండ్లో నిర్వహించే చేప ప్రసాదాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# నేనున్నాను మీ పిల్లలందర్ని చదివిస్తా..

**"భర్తను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న మహిళకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హామీ"**

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) మే 20 :** యాదాద్రి భువనగిరి జిల్లాలో సోమవారం ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్ నుంచి బయలుదేరిన మంత్రి మార్గమధ్యలో కార్యకర్తల అభ్యర్థన మేరకు భువనగిరి పట్టణ బైపాస్ రోడ్డులో వివేరా హోటల్ దగ్గర ఆగారు. కార్యకర్తలతో మాట్లాడి బయటకు వస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ముగ్గురు పిల్లలతో దీనంగా ఉన్న యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం ఆరేగూడెం గ్రామానికి చెందిన మమత అనే మహిళను చూసి ఏ ఊరమ్మా అంటూ అడిగారు. మంత్రి పలకరింపుతో దుఃఖాన్ని దిగమింగుకుంటూ తన భర్త హార్ట్ స్ట్రోక్ తో చనిపోయాడని ముగ్గురు పిల్లల్ని చదవించడం, కుటుంబాన్ని పోషించడం ఇబ్బందిగా మారిందంటూ తన దీనగాథను మొత్తం మంత్రికి వివరించింది. చలించిపోయిన మంత్రి పిల్లలను ఎంత చదివితే అంతవరకు తానే చదివిస్తానని ప్రస్తుతం



కుటుంబ పోషణ కోసం ఆర్థిక భరోసా కల్పించారు. మంత్రి సాయంతో భావోద్వేగానికి గురైన మమత ఆ దేవుడు మిమ్మల్ని చల్లగా చూడాలంటూ చేతులెత్తి వేడుకుంది. ఏదో ప్రభుత్వ సాయం కోసం అడుగుదామని వస్తే మా జీవితాలను మార్చివేశాడని సంతోషం వ్యక్తం చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్, కాంగ్రెస్ జిల్లా నాయకులు గుర్రం లక్ష్మీనరసింహ రెడ్డి, మండల కాంగ్రెసు పార్టీ మాజీ అధ్యక్షుడు పైళ్ళ సోమిరెడ్డి, మోత్కూరు పట్టణ అధ్యక్షులు గుండగోని రామచంద్రు గౌడ్, పన్నాల శ్రీనివాస్ రెడ్డి, మెంట నగేష్, గొలుసుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేయాలి

### గుమ్ముల మోహన్ రెడ్డి

**విశ్వంభర, నల్లగొండ మే 20 :** నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, జెడ్పిటిసీ వంగూరి లక్ష్మయ్య చిట్ల వెంకటేశం గౌడ్, ఎంపీపీ మనిమద్దె సుమన్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్ లు మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కు ఓటు వేసి గెలిపించాలని అలాగే అన్ని వార్డులలో, గ్రామాల్లో ఉన్న పట్టభద్రులని కలిసి నల్లగొండ నియోజకవర్గం నుండి అత్యధిక ఓట్లు వచ్చేలా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో కూసుకుంట్ల రాజిరెడ్డి, మైనార్టీ నాయకులు ఖాన్, పలువురు కౌన్సిలర్లు, మహిళా కాంగ్రెస్ ముఖ్య నాయకులు, వివిధ గ్రామాల ముఖ్య నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# రెండో భార్య ఒత్తిడితో కన్న తల్లిని, పిల్లలను చంపిన వ్యక్తి అరెస్ట్

**విశ్వంభర, తల్లాడ :** ఆస్తి కోసం కన్న తల్లిని, పిల్లలను అతి కిరాతకంగా చంపిన వ్యక్తిని, హత్యకు సహకరించిన అతని రెండో భార్యను తల్లాడ పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను విచారణ చేసిన అనంతరం కేసుకు సంబంధించిన వివరాలు వైరా సీఐ నునావత్ సాగర్ సోమవారం మీడియాకు తెలిపారు. తల్లాడ మండలం గోపాలపేట గ్రామానికి చెందిన పిట్టల వెంకటేశ్వర్లు ట్రాక్టర్ డ్రైవర్ గా పని చేస్తున్నాడు. అతని మొదటి భార్య కనకదుర్గ రెండు సంవత్సరాల క్రితం చనిపోవడంతో అప్పటినుండి తన ఇద్దరు పిల్లలు నీరజ, ఝాన్సీ మోహిని వెంకటేశ్వర్లు తల్లి పిచ్చమ్మ దగ్గరే ఉంటున్నారు. భార్య చనిపోయినప్పటి నుంచి వెంకటేశ్వర్లు తల్లాడకు చెందిన గూడె త్రివేణి తో అక్రమ సంబంధం పెట్టుకొని కొంతకాలం తల్లాడలో నివసించిన తర్వాత పెళ్లి చేసుకొని ఆరు నెలల నుంచి ఖమ్మంలో ఉంటున్నారు. ఆర్థిక ఇబ్బందులు మూలాన ఇద్దరు గొడవపడి తన తల్లి పిచ్చమ్మ, పిల్లల పేరున ఉన్న ఎకరం పొలం, ఇల్లు అమ్ముకొని రావాలని భార్య త్రివేణి భర్తను ఒత్తిడి చేస్తుంది. గత సంవత్సరం డిసెంబర్ లో వెంకటేశ్వర్లు తల్లిని బెదిరించి ఇల్లు తన పేరున రాయించుకున్నాడు. విషయం తెలిసిన బంధువులు, గ్రామస్తులు కల్పించుకొని అగ్రిమెంట్ పేపర్లు తీసుకున్నారు. దీంతో ఈర్ష పెంచుకున్న వెంకటేశ్వర్లుకు త్రివేణి తోడై ఎలాగైనా తల్లిని, పిల్లలను చంపితే ఆస్తి మొత్తం తమకే వస్తుందని, దానితో మనమందరం సంతోషంగా ఉండొచ్చని వాళ్ళని ఎలాగైనా చంపాలని భర్తను తీవ్రంగా ఒత్తిడి



చేసినట్లు విచారణలో తేలిందని చెప్పారు. ఈ క్రమంలో ఈ నెల 17న ఖమ్మం నుంచి బయలుదేరిన వెంకటేశ్వర్లు అర్ధరాత్రి దాటిన తర్వాత తల్లాడ మండలం నరసరావుపేట నుంచి నడుచుకుంటూ గోపాలపేటలో తల్లి, పిల్లలు నిద్రిస్తున్న సమయంలో ఇంటికి వెళ్లి మొదట తల్లి పిచ్చమ్మను తలగడ దిండుతో మోహం పై అదుముతూ, చేతులతో గొంతు నులిమి చంపాడని, ఆ తర్వాత తన ఇద్దరు పిల్లలను ఒకరి తర్వాత ఒకరిని అదే రీతిలో ఊపిరి ఆడకుండా చేసి చంపినట్లు నిందితుడు పోలీసుల సమక్షంలో ఒప్పుకున్నట్లు తెలిపారు. ముగ్గురు ప్రాణాలు పోయినట్లు నిర్ధారించుకొని నిందితుడు అక్కడ నుండి దాదాపు పది కిలోమీటర్లు నడుచుకుంటూ తల్లాడ చేరుకుని అక్కడ నుంచి ఖమ్మం వెళ్లినట్లు తెలిపారు. అదేరోజు నిందితులు సత్తుపల్లి వెళ్లేందుకు తల్లాడ ఆర్టీసీ బస్టాండ్ లో బస్సు కోసం చేస్తుండటంతో అరెస్టు చేసి స్టేషన్ కు తరలించామని ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్ కై మధిర కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

## విద్యార్థుల యోగ శిక్షణా తరగతుల బ్రోచర్ ఆవిష్కరణ

**విశ్వంభర, ఎల్బీనగర్ మే 20 :** విద్యార్థుల్లో ఏకాగ్రత జ్ఞాపకశక్తి పెంచి వారికి నైతిక విలువలతో కూడిన యోగ విద్యను అందజేయాలనే సదుద్దేశంతో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థుల వరకు బాలల వ్యక్తిత్వ వికాస యోగ శిక్షణా తరగతులను హుడా కాంప్లెక్స్ లో ఉన్నటువంటి లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ నందు స్వధర్మయోగి శ్రీ ఇస్మాయిల్ గురూజీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతున్నది. యోగ విద్యతో పాటుగా జీవిత పాఠాలు అనేటువంటి విలువైన అంశాలను తీసుకొని విద్యార్థులకు 22వ తారీకు నుండి 31 వరకు ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణా తరగతులు యొక్క బ్రోచర్ ను తమ యోగ సెంటర్లో నాలుగు గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించిన డ్రిల్ మాన్ క్రాంతి మరియు ఇస్మాయిల్ గురూజీ చేతుల మీదుగా ధ్యానులందరూ కలిసి బ్రోచర్ ఆవిష్కరణ జరపడం జరిగింది. నిత్యం రకరకాల మానసిక వత్తులతో బాధపడుతున్నటువంటి విద్యార్థులకు వాటిని అధికమించడానికి కావలసిన యోగ సాధన పద్ధతులు నేర్పిస్తూ మనసును ఆధీనంలో ఉంచుకోవడానికి చక్కటి యోగ సాధన పద్ధతులు నేర్పించడం జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో యోగ సాధకులు పాల్గొన్నారు.

# చేపల టెండర్ ప్రక్రియ పూర్తి

**విశ్వంభర, కార్వాన్ :** జూన్ 8న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో చేప మందు ప్రసాదం మొదలు కానున్న నేపథ్యంలో, ఈ నెల 13న మాసబ్ ట్యాంక్ మత్స్య భవన్ లో ప్రారంభమైన చేపల టెండర్ ప్రక్రియ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు పూర్తికావడంతో శ్రీనివాస్ (టీ ఎస్ ఎఫ్ సి ఓ ఎఫ్ జీఎం) బ్యాలెట్ బోస్ ను సీలింగ్ వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత సంవత్సరం లక్ష యాభై వేల హైబ్రిడ్ కొరమేను చేప పిల్లలు అవసరమయ్యాయన్నారు. తెలంగాణ నుంచి 70 వేలు, ఆంధ్రప్రదేశ్ నుంచి 80 వేల చేప పిల్లలను తీసుకువచ్చామని తెలిపారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు చేపల పంపిణీకి ఏపీ (4)తెలంగాణ నుంచి (3)మొత్తం 7 గురు టెండర్ వేసినట్లు ఆయన తెలిపారు. ఈ సంవత్సరం నాంపల్లి ఎగ్జిబిషన్ లో జరిగే చేప మందు ప్రసాదానికి 2 లక్షల వరకు చేప పిల్లలు అవసరమని అంచనా వేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# రాశి ఫలాలు

– మాధవశేషు స్వామి,
వాస్తు, జ్యోతిష్యం
పురోహిత్, సెల్:
9059308808



**19-05-2024 నుండి 25-05-2024 వరకు**

**మేష రాశి :** ఈ వరం విశేషంగా ఉన్నదని చెప్పవచ్చు. కార్య ఆటంకాలు కలిగిననూ సంపూర్ణంగా పనులు పూర్తి చేయుదురు. ఆర్థిక విషయాలలో సంతోషంగా ఉంటారు.

**వృషభ రాశి :** రాజ యోగంగా ఉన్నది. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. చేసే కృషి ఫలిస్తుంది. ఆర్థిక విషయాలు కొంత చికాకు కల్గిననూ వారం చివరన పూర్తి అవుతాయి. సోదర, బందు వర్గము నుండి విశేష సహకారం అందుకొందురు.

**మిథున :** శ్రమ చేత ఫలితాన్ని సాధించగలరు. కుతుమ్భాముున మాట విలువ తగ్గుతుంది. ఆర్థిక విషయాలు చికాకు కల్గిస్తాయి. కోర్టు, శత్రు కార్యాలు పరిష్కారం అగును.

**కర్కాటక :** గడ్డుకలంగా ఉన్నది. కోరుకున్న పనులు అవ్వక తీవ్ర నిరాశతో ఉంటారు. ఏ పని చేసిననూ ఒకటికి రెండు సార్లు తిరగవలసి వచ్చును. వాహనం నడుపుటలో జాగ్రత్త అవసరం.

**సింహరాశి :** సామాన్యంగా ఉన్ననూ అనుకున్న కోర్కెలను తీర్చుకుంటారు. కుటుంబ ఆర్థిక విషయాలు మెరుగుపడి సంతోషంగా ఉంటారు. కీర్తి ప్రతిష్ఠలు ఏర్పడుతాయి. శారీరక శ్రమ అధికముగా చేయటం వల్ల శిరోవ్యాధి అధికమగును.

**కన్యారాశి :** ఏ విషయం ఎలా ఉన్ననూ ఆరోగ్య విషయంలో తగిన శ్రద్ధను తీసుకొని జీవనాన్ని సాగించవలెను. శారీరకంగా ఎక్కువ కష్టాన్ని అనుభవించ వలసి వస్తుంది. ఆర్థిక విషయాలు సామాన్యంగా ఉండును. సంతానం ద్వారా ధన నష్టం కల్గును.

**తులరాశి :** అనుకునంగా ఉన్నది. నూతన ప్రయత్నాలు ఫలించును. గతంలో ఉద్యోగం లేనివారికి ఈ వరం ఉద్యోగం లభించును. పుత్ర సంతానం వలన ప్రగతిని సాధిస్తారు. భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా నిర్వహిస్తారు.

**వృశ్చికరాశి :** సామాన్యంగా ఉన్నదని చెప్పొచ్చు. నూతన వస్తు కొనుగోలు చేస్తారు. భార్య వలన మాట పట్టింపులు ఏర్పడి ఎడబాటు కల్గును. అభివృద్ధిలో ఆటంకాలు ఉన్ననూ అందరి మన్ననలతో ముందుకు సాగుతారు.

**ధనుస్సురాశి :** విశేష యోగావంతంగా ఉండును. తలచిన వెంటనే పనులు పూర్తి చేయుదురు. విదేశీ ప్రయాణాలు లభిస్తాయి. ఆర్థిక పరిస్థితి యోగావంతంగా ఉండును. భాగస్వామ్య వ్యాపారాలు సొంత నిర్ణయంతో చేసుకొనుట మంచిది.

**మకరరాశి :** సానుకూలంగా ఉన్నది. కొత్త వ్యాపారానికి ఆలోచిస్తారు. భార్య అనారోగ్యం మెరుగుపడును. ఆకస్మిక ప్రయాణం చేయుదురు. దాచిన కాగితాలు, డబ్బు మర్చిపోదురు. బంధు వర్గం వారితో జాగ్రత అవసరం. విరోధం ఏర్పడును.

**కుంభరాశి :** వ్యాపారాభివృద్ధి కల్గును. శరీరం అలసట ఉండును. కుటుంబ, ఆర్థికంగా అలోచించి ముందుకు సాగుతారు. పుత్ర సంతానం అభివృద్ధి ఎక్కువగా ఉండును. ఈ వారం స్నేహితులకు డబ్బులు బదులు ఇచ్చినచో తిరిగి రావు.


**మీనరాశి :** సామాన్యంగా ఉన్నది. ఆలోచనలు లేక కొంత అనిశ్చితిని కలిగి ఉంటారు. నిలకడ లేని తనము ఎక్కువగా ఉండును. కుటుంబ ఆర్థిక విషయాలు చికాకులు కల్గిన్చిననూ నిదానంగా శుభంగా పూర్తి అగును. నిద్రలేమి అధికమగును.

# అక్కినేని ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్..

## ఒకే వేదికపై చైతన్య, సమంత



**విశ్వంభర, సినిమా మే 20 :** టాలీవుడ్‌లో ఒకప్పటి క్యూట్ కపుల్ సమంత, నాగచైతన్య. కెరీర్ ప్రారంభం నుంచి లవ్ చేసుకున్న ఈ జంట పదేళ్ల తర్వాత వివాహ బంధంతో ఒకటి అయ్యారు. అయితే.. సడెన్‌గా మూడేళ్ల క్రితం విడిపోతున్నట్టు ప్రకటించి ఇద్దరూ ఫ్యాన్స్‌కి షాకిచ్చారు. నాగచైతన్య, సమంత విడిపోయి మూడేళ్లు అవుతున్నా అక్కినేని అభిమానులు మాత్రం ఈ విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో.. సందర్భం దొరికిన ప్రతీసారీ వీరిద్దరు కలిస్తే బాగుంటుందని ఫ్యాన్స్ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. అంతేకాదు.. చైత, సామ్ మళ్లీ కలుస్తారని కూడా చాలా సార్లు ప్రచారం జరిగింది. అయితే ఇన్నాళ్లకు అభిమానుల కోరిక నిజం కాబోతుంది. సమంత, నాగచైతన్య మళ్లీ కలవబోతున్నారు. అయితే.. జీవితంలో కలవడం కాదు. ఓ సినిమా ఈవెంట్‌లో కలవనున్నారు. విక్రమ్ కుమార్ డైరెక్షన్‌లో 2014లో వచ్చిన సినిమా 'మనం'. ఈ సినిమాలో అక్కినేని ఫ్యామిలీలో మూడు జనరేషన్లు నటించాయి. అక్కినేని నాగేశ్వర రావు, కింగ్ నాగార్జున, నాగచైతన్య, అఖిల్, సమంత, శ్రియ శరణ్, అమల, కీలక పాత్రల్లో నటించి మెప్పించారు. ఒకే స్క్రీన్‌పై అక్కినేని ఫ్యామిలీని చూసి నాగ్ అభిమానులే కాకుండా సినిమా ఆడియన్స్ అంతా వావ్ అన్నారు. 2014లో వచ్చిన ఈ సినిమా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా మంచి మార్కులు కొట్టింది. డిఫరెంట్ స్క్రీన్ ప్లేతో విక్రమ్ కే కుమార్ ఆడియన్స్ ను మెస్మరైజ్ చేశారు. అయితే ఈ సినిమా విడుదలై ఏకంగా 10 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా మేకర్స్ మే 23న రెండు తెలుగు రాష్ట్రాల్లో మనం స్పెషల్ షోలను ఏర్పాటు చేశారు. అన్నపూర్ణ స్టూడియోస్ సోషల్ మీడియాలో కూడా ఈ విషయంపై అధికారిక ప్రకటనను కూడా విడుదలైంది. ఈ రీరిల్ ఫంక్షన్‌కి మనం యూనిట్ మొత్తం వస్తుంది. దీంతో.. ఈ సినిమాలో కీ రోల్ చేసిన సమంత కూడా వస్తున్నారు. దీంతో.. కనీసం ఇలా అయినా సమంత, చైతన్యను ఒకే ఫ్రేమ్‌లో చూసుకుంటామని ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.




### ఫ్యాన్స్‌ను ఉద్దేశించి

# జూనియర్ ఎన్టీఆర్ స్పెషల్ పోస్ట్

**విశ్వంభర, సినిమా :** మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ పుట్టిన రోజు నేడు. ఈ సంగతి అభిమానులకు ప్రత్యేకంగా చెప్పా ల్సిన పని లేదు. ఈ సందర్భంగా ఆయనకు సోషల్ మీడి యా వేదికగా శు భాకాంక్షలు వెల్లువెత్తాయి. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు ఆయనకు విషెస్ తెలియజేశారు. ఈ క్రమంలో అభిమానుల ఉ ద్దేశించి ఎన్టీఆర్ ఓ స్పెషల్ పోస్ట్‌ను పంచుకున్నారు. ప్రియమైన అభిమానులారా.. నటుడిగా నా ప్రయాణం మొదలైన మొదటి రోజు నుంచి మీరంతా నాకు అండగా ఉన్నారు. నన్ను ఎంతగానో సపోర్ట్ చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మీ అసామాన్య ప్రేమకు కృతజ్ఞుడిని. దేవర సినిమాలోని దేవర పాటకు మీ అందరి నుంచి వచ్చిన స్పందన ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. స్నేహితులు, కుటుంబ సభ్యు లు, శ్రేయోభిలాషులు, చిత్ర పరిశ్రమలోని సహచరులు అందరికీ ధన్యవాదాలు అని ఆ నోట్‌లో ఎన్టీఆర్ తెలిపారు. ఇదిలా ఉంటే.. ఆర్ఆర్ఆర్ సినిమా తరువాత ఎన్టీఆర్ వరుసగా భారీ చిత్రాలను చేస్తూ బిజీగా ఉన్నాడు. ప్రస్తుతం ఎన్టీఆర్ కొరటాల శివ దర్శకత్వంలో దేవర సినిమాతో పాటు బాలీవుడ్ లో వార్ 2 మూవీలో నటిస్తున్నాడు. ఈ రెండు సినిమాల తరువాత ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నాడు. ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భం గా ఈ చిత్రం నుంచి అప్‌డేట్‌ను ఇచ్చారు. ఆగస్టు 2024 నుంచి ఈ చిత్ర షూటింగ్‌ను మొదలుపెట్టనున్నట్లు తెలియజేశారు. ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్నారు. ఇక దేవర మూవీ పార్ట్ 1 అక్టోబర్ 10న దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ఆనంద్ దేవరకొండ 'గం గం గణేశా' ట్రైలర్ వచ్చేసింది




విశ్వంభర, సినిమా : విజయ్ దేవరకొండ తమ్ముడిగా సినీ పరిశ్రమలో అడుగుపెట్టినా వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ తన కంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు ఆనంద్ దేవరకొండ. ఇటీవల బేబీ మూవీతో భారీ హిట్ అందుకున్న ఆనంద్ నటిస్తున్న తాజా చిత్రం 'గం గం గణేశా'. ఉదయ్ శెట్టి దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. ప్రగతి శ్రీవాత్సవ హీరోయి-న్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని హై-లైఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి లు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్, టీజర్, సాంగ్స్ విడుదల చేయగా మంచి స్పందన వచ్చింది. మే 31న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలోనే చిత్ర బృందం ప్రమోషనల్ కార్యక్రమాల్లో వేగం పెంచింది. అందులో భాగంగా ట్రైలర్‌ను విడుదల చేసింది. ట్రైలర్‌లో ఓ దొంగగా, ఓ లవర్ బాయ్‌గా ఆనంద్ కనిపించాడు. ట్రైలర్‌ను చూస్తుంటే ఇది ఓ కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా కనిపిస్తోంది. మొత్తంగా ట్రైలర్ ఆకట్టుకుంది. జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్, నయన్ సారిక, వెన్నెల కిషోర్, రాజ్ అర్జున్, సత్యం రాజేష్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



### ఈసారి ఇండియాప్రపంచకప్

# విజేతగా నిలుస్తుంది : శిఖర్ ధావన్



**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఈసారి ఇండియా టి20 ప్రపంచ కప్ విజేతగా నిలుస్తుందని మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ విశ్వాసం వ్యక్తంచేశాడు. అతడు ఓ ఇంగ్లీష్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ "ప్రపంచకప్‌లలో ఇండియా ఆడుతుంటే చాలా ఒత్తిడి ఉంటుంది. కానీ, రోహిత్ శర్మ అనుభవజ్ఞుడైన ఆటగాడు. అతడికి ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో తెలుసు అని అన్నారు. ఇండియా ఈసారి విజయంతో తిరిగి వస్తుందని నమ్ముతున్నా. చాహల్,శివం దుబే, సంజూ సాంసన్ కు తగిన అవకాశాలు లభించాయి. వారిని జట్టులో చూసి చాలా సంతోషంగా అనిపించింది. టీమ్ ఇండియా చాలా సమతౌల్యంగా ఉంది" అని తెలిపారు. విరాట్ మరోసారి ప్రపంచకప్‌లో విజృంభిస్తాడని ,గత ప్రపంచకప్‌ల్లో కూడా అతడు రాణించిన విషయాన్ని ఆయన గుర్తు చేశాడు. "ఈసారి జట్టు విజయాల్లో రోహిత్ శర్మ తోపాటు.. విరాట్ కోహ్లీ, బుమ్రా కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. ఛేజ్ మాస్టర్‌గా పేరున్న కింగ్ విరాట్ కోహ్లీ మైదానంలో ఉంటేనే.. ప్రత్యర్థి జట్టు ధైర్యం కోల్పోతుంది. ఇక 3 ఫార్మాట్లలో బుమ్రా ప్రపంచంలోనే అత్యుత్తమ బౌలర్. ఇండియా కప్పు గెలవాలంటే అతడు ముఖ్య భూమిక పోషించాలి" అని అన్నారు.

# ప్లే ఆఫ్స్ షెడ్యూల్ ఇదే..

**విశ్వంభర, స్పోర్ట్స్ :** దాదాపు రెండు నెలల సుదీర్ఘ ప్రయాణం తర్వాత నాలుగు జట్లు నాకౌట్ దశకు చేరుకోవడంతో ఐపీఎల్ ప్లేఆఫ్స్‌కు వేళైంది. రెండు జట్లు కాస్త ఈజీగానే బెర్త్‌లు కన్ఫామ్ చేసుకున్నా మరో రెండు మాత్రం సంచలన ప్రదర్శనతో మిగతా రెండు స్థానాలను దక్కించుకున్నాయి. మరి ఈ రెండు నెలల పాటు ఎవరి ప్రయాణం ఎలా కొనసాగిందో చూద్దాం. టోర్నీ మొదలు అవ్వకముందు కోల్‌కతా టాప్ - 4కు దూసుకు వస్తుందని ఎవరూ ఊహించలేదు. కానీ టోర్నీలో సునీల్ నరైన్, ఫిల్ సాల్ట్, ఆండ్రి రస్సెల్ విధ్వంసం, బౌలింగ్‌లో కుర్రాళ్లు వైభవ్ అరోరా, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి వంటి వారు రాణించడం వల్ల కోల్‌కతా అగ్రస్థానానికి దూసుకెళ్లింది. మొత్తం 14 మ్యాచ్‌లు ఆడి 9 విజయాలు నమోదు చేసింది. 20 పాయింట్లను ఖాతాలో వేసుకుంది. రెండు మ్యాచులు మాత్రం వర్షం కారణంగా రద్దయ్యాయి. గత సీజన్లలో పేలవ ప్రదర్శన చేసిన సన్‌రైజర్స్ ఈ సారి మాత్రం అనూహ్యంగా అద్భుత ప్రదర్శన చేసి ప్లేఆఫ్స్‌కు చేరింది. ఏకంగా రెండో స్థానంలో నిలిచింది. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ ఓపెనింగ్స్, క్లాసెన్ హిట్టింగ్, నితీశ్‌రెడ్డి ఆల్‌రౌండ్ ఇన్నింగ్స్, అబ్దుల్ ఫినిషింగ్ వల్ల 14 మ్యాచుల్లో 8 విజయాలు నమోదు చేసింది. ఒక మ్యాచ్ రద్దు వల్ల 17 పాయింట్లను దక్కించుకుంది. అలానే ఐపీఎల్‌లోనే అత్యధిక స్కోరు (287) సాధించిన జట్టుగానూ రికార్డుకెక్కింది.

### షెడ్యూల్ ఇదే -

- మే 21న అహ్మదాబాద్‌లో కోల్‌కతా వర్సెస్ హైదరాబాద్ క్వాలిఫయర్ -1 జరగనుంది.
- మే 22న అహ్మదాబాద్‌లో బెంగళూరు - రాజస్థాన్ ఎలిమినేటర్ మ్యాచ్ ఆడనున్నారు.
- మే 24న మొదటి క్వాలిఫయర్‌లో ఓడిన టీమ్ - ఎలిమినేటర్ విజేత జట్టు మధ్య మ్యాచ్
- మే 26 న క్వాలిఫయర్ - 1 విజేత - క్వాలిఫయర్ - 2 విజేత మధ్య తుది పోరు జరగనుంది

# ఇప్పటి వరకు ధోనీ మాకేం చెప్పలేదు..

## రిటైర్‌మెంట్‌పై చెన్నై ఫ్రాంచైజీ



విశ్వంభర, స్పోర్ట్స్ : ఐపీఎల్ 2024 సీజన్‌లో కీలక మ్యాచ్‌లో సీఎస్కేపై బెంగళూరు విజయం సాధించడం తో టోర్నీ నుంచి చెన్నై నిష్క్రమించక తప్పలేదు. ఈ మ్యాచ్‌లో ఎంఎస్ ధోనీ దూకుడుగా ఆడి జట్టును గెలిపించే ప్రయత్నం చేసినా కుదరలేదు. ఈ సీజన్ తర్వాత మాహీ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతాడని అంతా భావిస్తున్నా.. ధోనీ మాత్రం ఇంకా స్పందించలేదు. ఇదే విషయాన్ని చెన్నై క్రికెట్ వర్గాలు మరోసారి స్పష్టం చేశాయి. "ధోనీ ఇప్పటి వరకు తన ఫ్యూచర్ ప్లాన్స్ గురించి మాతో మాట్లాడలేదు. తాను వీడ్కోలు పలుకు తానని ఎప్పుడూ చెప్పలేదు. మేనేజ్‌మెంట్‌తో తన నిర్ణయం వెల్లడించేందుకు కాస్త సమయం తీసుకుం టాడని అనుకుంటున్నాం. ప్రస్తుత సీజన్‌లో అతడు వికెట్ల మధ్య పరుగెత్తడంలో ఎక్కడా ఇబ్బంది పడినట్లు అనిపించలేదు. వచ్చే సీజన్‌లో ఇంపాక్ట్ రూల్‌ను ఉపయోగించుకుని ధోనీని కేవలం బ్యాటింగ్‌కే దిగేలా చూడాలని అభిమానులు కోరుతున్నారు. కానీ, 'కెప్టెన్ కూల్' ఎలాంటి డెసిషన్ తీసుకుంటాడో తెలియదు. ఈ సీజన్ ఇప్పుడే ముగిసింది. అతడితో మాట్లాడేం దుకు సరైన సమయం కోసం వేచి చూస్తున్నాం. జట్టు ప్రయోజనాల కోసమే ఎప్పుడూ ఆలోచించే వ్యక్తి ధోనీ. కాబట్టి, ఎలాంటి నిర్ణయం తీసుకున్నా మాకు ఇబ్బంది లేదు" అని సీఎస్కే వర్గాలు తెలిపాయి.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana.
Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com